ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 | సంచిక : 10 | జూన్ 2023

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2


సమస్యల నడుమ నిశ్చింతగా ఉండగలగటమే గొప్ప లక్షణం . 25

అక్షరమణమాల ........................................................ 27

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



మనస్సుకు లోచూపు నేర్పు. మనస్సు దాని మూలమైన హృదయంలో నిలబడి ఉండేటట్లు చూడు. హృదయంలో మనస్సును స్థిరంగా ఉంచటం వలన అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది. అప్పుడు అక్కడ ఉన్న సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 21 మే 1989, కోపల్లె

ప్రియమైన ఆత్మబంధువులారా!

మనకు ప్రాపంచిక సంపదలు, గౌరవాలు, ఇంకా ఎన్ని ఉన్నప్పటికీ, భౌతికమైన వస్తువుల నుంచి మనం ఆత్మ శాంతిని కాని, ఆత్మ సుఖాన్ని కాని పొందలేము. మనం సుఖపడాలంటే, శాంతి అనుభవించాలి అంటే, ఆత్మ జ్ఞానం కనుక లేకపోతే ఆత్మ సుఖం రాదు. ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మలో కూడా రాదు. అందరూ సుఖాన్ని కోరుకుంటున్నారు అనుకోండి, సుఖం కోరుకునే వాళ్ళు ప్రతీ వాళ్ళకు కూడా ఆత్మ జ్ఞానం కావాలి. ఆత్మ జ్ఞానం వల్ల తప్పించి, ఇంక ఏ జ్ఞానం వల్ల కూడా సుఖం తెలియదు. మీకు సుఖం కావాలి అనుకుంటే, సుఖం ఎక్కడుంది? ఆత్మలో ఉంది. ఆత్మ ఎవరు? నువ్వే. ఆత్మ ఎప్పుడూ ఉంది, శాశ్వతంగా ఉంది. పెళ్ళి కూడా ఒక యజ్ఞమే. ఎందుకు? మన శరీరాలు బొమ్మలు. ఒక ఆడ బొమ్మకి, ఒక మగ బొమ్మకి పెళ్లి చేస్తారు. ఈ రెండు బొమ్మలు కలిసి ఇంకో రెండు బొమ్మలనో, నాలుగు బొమ్మలనో తయారు చేస్తాయి. బొమ్మలు బొమ్మలని తయారు చేయటానికి పెళ్ళిళ్ళు చేస్తారు. అందుచేత పెళ్ళిళ్ళు కూడా ఒక యజ్ఞం అన్నారు. ఈ పెళ్లి అనే యజ్ఞం వల్ల సంతానం కలుగుతుంది. దీనివల్ల సృష్టి నడుస్తూ ఉంటుంది. ఇది లోక వ్యవహారం. అయితే ఈ పెళ్లి వల్ల కాని, ఈ సంతానం వల్ల కాని, ఈ ధనం వల్ల కాని, ఈ భోగం వల్ల కాని, ఈ లోకం వల్ల కాని, ఈ స్నేహితుల వల్ల కాని, ఎవ్వరి వల్ల సుఖం రాదు. సృష్టిలో దేనివల్ల సుఖం రాదు. ఎందుచేత అంటే సుఖం బయట ఎక్కడా లేదు. ఎక్కడో బయట ఉందని అనిపిస్తుంది. పెళ్లి అవ్వక ముందు అనిపిస్తుంది. పెళ్లి అయిన తరువాత ఎంత సుఖంగా ఉంటామో, తరువాత పెళ్ళిలో ఏమి లేదు అనిపిస్తుంది. తరువాత సంతానం కలిగాక అనిపిస్తుంది సంతానం లేకపోవటమే మంచిది అని, కొంతమందికి పాపం అటువంటి సంతానం కలుగుతూ ఉంటారు. చాలా మంచి సంతానం కలిగినప్పటికీ, ఒకరకమైనటువంటి సంతోషం వస్తుంది కాని సుఖం అనేది రాదు. సుఖం సృష్టిలో ఎక్కడా లేదు. సుఖం ఎక్కడ ఉంది అంటే బ్రహ్మములో ఉంది. అది ఎక్కడ ఉంది అంటే మన హృదయంలో ఉంది. నిజమైన సుఖి ఎవడు అంటే, రమణమహర్షి నిజమైన సుఖి, రాముడు నిజమైన సుఖి. వాళ్ళు అనుభవించే సుఖాన్ని మన మనసు ఊహించలేదు.

వారు సుఖస్వరూపులు. ఆత్మను ఎందుకు తెలుసుకోవాలి అంటే ప్రతి మనిషికి సుఖం కావాలి. సుఖం ఈ లోకంలో లేదు, పరలోకంలో లేదు, సుఖం ఎక్కడ ఉంది అంటే ఆత్మలో ఉంది. ఆత్మను తెలుసుకున్నాక అనిపిస్తుంది అసలు ఏంటి పూర్వ జీవితం కూడా ఒక జీవితమేనా? ఆత్మను తెలుసుకున్నాక ఎంత శాంతి, ఎంత సుఖాన్ని అనుభవిస్తున్నానో, ఇప్పటివరకు నా రోజులు ఎంత వృధా చేశానో అనిపిస్తుంది. మీకు కొత్త జన్మ వచ్చినట్టు అనిపిస్తుంది. ఈ సద్వస్తువుకి ఏమని పెట్టారంటే సత్ చిత్ ఆనందం. దేవుని యొక్క పేరు అది. సత్ చిత్ ఆనందం. సత్ అంటే ఎప్పుడూ శాశ్వతంగా ఉండేది. బ్రహ్మము ఎప్పుడూ శాశ్వతంగా ఉంది. మాయ వల్ల మనం ఎక్కడో దురాన ఉంది అనుకుంటాం కానీ అది మన హృదయంలో ఉంది. భగవంతుడు ఎక్కడ ఉన్నాడు అంటే మన హృదయంలో ఉన్నాడు. శాశ్వతంగా ఉంటాడు. ఒక్క నిమిషం కూడా మనలని విడిచి పెట్టి ఉండదు ఆ వస్తువు. చివరకు మనం మరణించినప్పుడు కూడా మన మరణాన్ని కూడా ఆ వస్తువు చూస్తూ ఉంటుంది. బ్రహ్మము మనలని విడిచి పెట్టి మటుకు ఉండదు. అది ఎప్పుడూ ఉంటుంది. సత్ అంటే ఏమిటి ఎల్లప్పుడూ, శాశ్వతంగా, నిరంతరంగా, ఎటర్నల్‌గా ఉండే వస్తువు సద్వస్తువు. దానికి ఇంకో పేరు ఏమి పెట్టారు చిత్, చిత్ అంటే చైతన్యం. అది ఎప్పుడూ ఉండటమే కాకుండా చైతన్యం తోటి ఉంటుంది. జ్ఞానం తోటి ఉంటుంది. చాతనా శక్తి ఎవడికి అయితే అభివృద్ధి అవుతుందో, వాళ్లకి విషయం అర్థం అవుతుంది. నేను ఏదో చెబుతున్నాను అనుకోండి, లోపల మీకున్న చేతనా శక్తి తక్కువ అనుకోండి ఎంత చెప్పినా మీకు అర్థం అవ్వదు. కృష్ణుడు చెప్పిన మాటలు అబద్ధం, రాముడు చెప్పిన మాటలు అబద్ధం, రమణుడు చెప్పిన మాటలు అబద్ధం అనిపిస్తుంది. భర్త యొక్క చేతనా శక్తి వేరు, భార్య యొక్క చేతనా శక్తి వేరు అనుకోండి, చేతనా శక్తి తక్కువ ఉంది అనుకోండి భార్యలో, భర్తలో ఎక్కువ ఉంది అనుకోండి, జీవితం పొడుగునా బోధించినా భర్త చెప్పేది భార్యకి అర్థం అవ్వదు. అదే విధంగా భర్తలో చేతనా శక్తి తక్కువ ఉంది అనుకోండి, భార్యలో ఎక్కువ ఉంది అనుకోండి, భార్య చెప్పింది భర్తకు అర్థం అవ్వదు. అయితే వాళ్ళ వాళ్ళ చైతన్య స్థాయిని బట్టే అందరూ ప్రవర్తిస్తారు. నేను ఎన్ని చెప్పినప్పటికీ మీ చైతన్య స్థాయిని బట్టే మీరు ప్రవర్తిస్తారు. నా చైతన్య స్థాయిని బట్టే నేను ప్రవర్తిస్తాను. పార్వతి తన చైతన్య స్థాయిని బట్టి అది ప్రవర్తిస్తుంది. సృష్టిలో ఎన్నో కోట్లాది మంది ఉన్నారు. ఒకరి ప్రవర్తన ఉన్నట్టు ఇంకొకరు ప్రవర్తన ఉండదు. దానికి కారణం ఏమిటి? అందరూ మనుషులు

కాదా అంటే అందరూ మనుషులే. లోపల చేతనా శక్తి వికసించే కొలది అర్థం చేసుకోవడంలోబుద్ధి వికాసంలో, చేష్టల్లో, తోటి మానవులను ప్రేమించడంలో, అడుగు అడుగుకి తేడా ఉంటుంది. మనం భగవద్గీత చదువుతున్నాం. భగవద్గీత వింటున్నాం. కాని మనకి ఆచరించాలి అనేబుద్ధి మనకి ఇంకా కలగటం లేదు. ఎందుచేత చేతనా శక్తి మనకి తక్కువ ఉండటం వల్ల. గీతలో అర్జునుడు చివరి మాటగా ఏమి చెప్పాడు అంటే నువ్వు ఎలా చెబితే అలా వింటాను. అది శరణం అంటే, నువ్వు ఎలా చెబితే అలా నేను వింటాను. ఇన్ని చెప్పిన అర్జునుడు ఆఖరున పద్ధెనిమిదో అధ్యాయం విన్నాక అతని హృదయం సంస్కరించబడింది. అసలు మనం హైస్కూల్‌లో చదువుకున్నా, కాలేజిలో చదువుకున్నా, యూనివర్సిటీలో చదువుకున్నా మన బ్రెయిన్‌కి కొంత education ఇస్తున్నారు కాని మన హృదయానికి వికాసం రావడం లేదు. అందుచేత హృదయాన్ని ఎవరైతే వికసింప చేసుకుంటున్నారో ఈ చైతన్య శక్తిని ఎవరైతే పెంచుకుంటున్నారో వాళ్ళు సుఖాన్ని పొందగలుగుతారు. ఎవరు ఏమి చేసినప్పటికీ సుఖపడటం కోసమే. ఎవరికైతే హృదయంలో ఉన్నటువంటి శక్తి అర్థం అయ్యిందో, వాడికి అపరిమితం అయినటువంటి శాంతి, అపరిమితం అయినటువంటి సుఖం, అపరిమితం అయినటువంటి సంతోషం, ఎంత అంటే మీరు అనుభవించే సుఖం అంతా కలిపి సముద్రంలో నీరు కంటే ఎక్కువగా ఉంటుంది. అన్ని సముద్రాలలో ఎంత నీరు ఉంటుందో ఆ నీరు కూడా సరిపోదు ఆ హృదయంలో అనుభవించే సుఖానికి, అప్పుడు లోకం కూడా మీకు చిన్న గడ్డి పరక కింద అనిపిస్తుంది. మొత్తం సృష్టి అంతా కూడా చిన్న గడ్డి పరక కింద మీకు కనిపిస్తుంది. ఆ చైతన్య వస్తువు మీకు దొరికినప్పడు, ఇదంతా జఢమే, మన శరీరం జఢం, లోకం జఢం. అయితే ఇప్పడు మనం పడే కష్టాలకి, నష్టాలకి, దుఃఖాలకి, బాధలకి, భారాలకి, మనం ఎన్ని కష్టాలు పడుతున్నప్పటికీ, సంసార బాధలు అవ్వనివ్వండి, లౌకికమైన బాధలు అవ్వనివ్వండి, ప్రకృతి బాధలు అవ్వనివ్వండి, అన్నిటికి ఒక్కటే కారణం. ఏ మనిషి పడ్డ బాధకు అయినా ఒక్కటే కారణం. ఏ రకమైన బాధ అయినా కూడా ఒకటే కారణం. దేహం నేను అనుకునేబుద్ధి కారణం. ఈ దేహ సంబంధాన్ని విడిచిపెట్టేస్తే, ఏమి లేదు. దేహ సంబంధమే జీవుడు. దేహ సంబంధం వల్లే మీరు మరణిస్తున్నాను అనుకుంటున్నారు. దేహ సంబంధం వల్లే మళ్ళీ మీకు జన్మ వస్తుంది. అన్నీ దేహ సంబంధమే. అంటే దేహ సంబంధమే జీవ లక్షణం. దేహ సంబంధాన్ని ఎవడైతే విడిచి పెట్టేశాడో వాడికి వెంటనే జ్ఞానం కలుగుతుంది. మళ్ళీ దేహం రాదు. ఇదే

రమణమహర్షి గారు చెప్పారు. నీకు ఏమి ప్రయత్నం అక్కర్లేకుండా, సాధన అక్కర్లేకుండా, శ్రవణం అక్కర్లేకుండా, మననం అక్కర్లేకుండా, ఏదో ఒక రోజున చనిపోతావు నువ్వు. ప్రతీ మనిషి చనిపోతాడు. వాడు శ్రవణం చెయ్యనక్కర్లేదు. సాధన చెయ్యనక్కర్లేదు. ఏదో ఒకరోజున శరీరం చనిపోతుంది. శరీరం శవం అవుతుంది. అయితే ఈ శరీరాన్ని నేను అనుకుంటున్నాం చూశారా, దేహం నేను అనే మొదటి తలంపు. అది మటుకు చావదు. అది స్మశానంలో మటుకు చావదు. భౌతికమైన అగ్ని వల్ల అది కాలదు. జ్ఞానాగ్ని వల్ల మటుకే దేహం నేను అనేటువంటి అహంకారం, మొదటి తలంపు నశిస్తుంది. మీకు తొంభై తలంపులు ఉన్నాయి. నాకు తలంపులు ఉన్నాయి. తలంపులు లేనివాడు, ఆలోచనలు లేనివాడు, ఉహాలు లేనివాడు, సృష్టిలో లేడు. చెడు తలంపులు రావచ్చు, మంచి తలంపులు రావచ్చు, అనేక తలంపులు ఉంటాయి. తలంపులు లేని మనిషి లేడు. అయితే దేహం నేను అనే మొదటి తలంపుకి మిగతా తలంపులు అన్నీ వస్తున్నాయి. ఈ అన్ని తలంపులకి దేహం నేను అనే తలంపు అడుగున ఉంది, లోపల ఉంది, పునాదిలో ఉంది. మిగతా తలంపుల నుండి ముందు దేహం నేను అనే తలంపుని విడదీయాలి. అలా విడదీస్తేనే కాని వాడికి జ్ఞానం కలగదు. నువ్వు ఆత్మను ఎప్పుడైతే తెలుసుకున్నావో అప్పుడు మృత్యువు యొక్క స్థితిని దాటిపోతావు. అయితే ఈ ఆత్మను తెలుసుకోవటానికి జనరల్‌గా అడ్డు ఏమిటి? ఆత్మ ఎప్పుడూ ఉంది, ఇప్పుడు ఉంది. అది సదా ఉంది, అది లేని క్షణం లేదు. అయితే దానికి ఏవి అడ్డు వస్తున్నాయి అంటే, ఇష్టం, అయిష్టం, రాగ, ద్వేషాలు మనకు అడ్డు వస్తున్నాయి. ఆత్మను తెలుసుకోవడానికి సాధారణంగా మనకు అడ్డు వచ్చేవి ఏమిటంటే రాగ ద్వేషాలు. ఒకళ్ళ మీద ఇష్టం, ఒకళ్ళ మీద అయిష్టం. ఈ రాగ ద్వేషాలే సంసారానికి కారణం. రాగ ద్వేషాలే బంధానికి కారణం. రాగ ద్వేషాలే అశాంతికి కారణం. రాగ ద్వేషాలే అజ్ఞానానికి కారణం. ఈ రాగ ద్వేషాలే మనిషికి అడ్డు వస్తున్నాయి. చాలామంది ఏమి అంటారు అంటే మేము సాధన చేస్తున్నాం, మేము పూజలు చేస్తున్నాం, జపం చేస్తున్నాం, ధ్యానం చేస్తున్నాం, ఇవన్నీ కష్టపడి చేస్తున్నాం అభివృద్ధి కనిపించటం లేదు అంటారు. చాలా



**మీరు విరామ సమయాన్ని ఎంత బాగా సద్వినియోగం చేసుకుంటే అంత తొందరగా జ్ఞానం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది.**

complaint ఇదే, ఏ ఊరు వెళ్ళి చెప్పినా, భక్తుల అనుభవాలు ఏమి చెబుతారు అంటే, మేము ఏదో చేస్తున్నాం కాని అభివృద్ధి కనిపించటం లేదు. మీకు వైరాగ్యం లేనప్పుడు అభివృద్ధి ఎన్నడూ కనపడదు. ఇది మీరు బాగా జ్ఞాపకం ఉంచుకోండి. వైరాగ్యం లేనివాడికి, అభ్యాసం లేనివాడికి జ్ఞానం రాదు. కుండ పైనుంచి నీళ్ళు పోస్తున్నారు అనుకోండి, కింద చిల్లులు ఉంటే ఏమి అవుతుంది? కుండలో వేసిన నీళ్ళు అన్నీ పోతాయి. రామకృష్ణ పరమహంస ఏమి మాట చెప్పాడు అంటే మీరు చేలోకి నీళ్ళు పెడుతున్నారు అనుకోండి, ఒక కంతలోంచి నీళ్ళు పెట్టి, ఇంకో కంతలోంచి వదిలేశారు అనుకోండి, ఆ చేలో నీరు నిల్వ ఉంటుందా అని అడిగాడు. ఆధ్యాత్మిక విలువ తెలియనివాడికి, వైరాగ్యం లేనివాడికి ఆధ్యాత్మిక అభివృద్ధి కలగదు. మనం అందరం ఇక్కడ కూర్చొన్నాం. మనం అందరం భక్తులం. మనం చేసే భక్తికి రేణింపు ఉందా? అసలు వికాసం ఉందా మనకి? లేదు. ఎందుచేత? నాకున్న భక్తిలో స్వార్ధం ఉంది.

మనం తిరుపతి వెళితే ఏమన్నా కావాలి, అరుణాచలం వెళితే ఏమన్నా కావాలి, ఏదో ఒక కోరికతో చేస్తాము. మనం స్వార్ధం లేకుండా ఏ పని చెయ్యము. అంతే కదా, మనకి భక్తి ఉన్న మాట నిజమే, నూటికి నూరు పాళ్ళు స్వార్ధ పూరితం అది. మనకి లోపల స్వార్ధం ఉండగా మనకి జ్ఞానాన్ని ఇచ్చేటంత అమాయకుడు ఏమి కాదు దేవుడు. రమణమహర్షి గారు ఒక మాట చెప్పారు. మీరు ఎవరిని అయినా మోసం చేయవచ్చు కాని దేవుడిని మోసం చేయలేరు. ఎందుచేత దేవుడిని మీరు మోసం చెయ్యలేరు అంటే తలంపు వచ్చాక మీకు మోసం చెయ్యాలి అనిపిస్తుంది. ఆ తలంపు రాకముందే మీకు ఎటువంటి తలంపు వస్తుందో దేవుడికి తెలుస్తుంది అందుచేత దేవుడిని మోసం చేయలేరు. మన అందరికి భక్తి ఉన్న మాట నిజం కాని స్వార్ధం ఉంది. కామ్య భక్తి మనది, నిష్కామ భక్తి కాదు. అంటే కామ్య కర్మలు మనం చేస్తున్నాం. స్వార్ధాన్ని దృష్టిలో పెట్టుకునే కర్మ చేస్తాం, స్వార్ధాన్ని దృష్టిలో పెట్టుకునే పని చేస్తాం, స్వార్ధాన్ని దృష్టిలో పెట్టుకునే పూజ చేస్తాం. ప్రతీ విషయాన్నీ స్వార్ధాన్ని దృష్టిలో పెట్టుకుని చేస్తాం కాబట్టి, మనకి వికాసం ఉండదు. ఎన్ని జన్మలు ఎత్తినప్పటికీ, ఎన్ని పూజలు చేసినప్పటికీ, ఎన్ని యజ్ఞాలు చేసినప్పటికీ నీకు భోగాలు వస్తాయి, మంచి మంచి జన్మలు వస్తాయి. కానీ నీకు ఆత్మ తెలియదు. మనం వైరాగ్యాన్ని పెంచుకుంటూ ఉంటే మనకి రాగం పోతుంది. Attachment పోతుంది. ద్వేషం ఎందుకు పెరుగుతుంది అంటే మనకి ప్రేమ లేని మూలాన ద్వేషం పెరుగుతుంది. ఈ రాగ ద్వేషాలు

రెండు కూడా మనలో ఆత్మ ఉన్నప్పటికీ, ఆత్మ స్వరూపాన్ని మనకి తెలియనివ్వటం లేదు. కొంతమంది ఎదుటివాళ్ళను అస్తమాను విమర్శిస్తూ ఉంటారు. ఇదొక అలవాటు. మాకు ఈ మధ్యన దేవుడి గుళ్ళోకి ఎక్కడికైనా వెళితే ఓ స్వామి నాకు మంచి స్నేహితులని ప్రసాదించండి అనిపిస్తోంది. నాకు జ్ఞానం ప్రసాదించు, వైరాగ్యం ప్రసాదించు అని పూర్వం అనుకునేవాడిని. ఇపుడు అది మరచిపోయాను మంచి స్నేహితులను ప్రసాదించు అంటున్నాను. ఎందుచేత అంటే మంచి స్నేహితులు కనుక మనకి దొరికితే తక్కువ సాధన తోటి మనకు మోక్షం వచ్చేస్తుంది. అంటే తక్కువ పెట్టుబడి తోటి ఎక్కువ లాభం అన్నట్టు, స్వామి నాకు మంచి స్నేహితులను ప్రసాదించు అంటున్నాను. ఎదుటివాళ్ళను విమర్శించు కుంటూ పోతారు అనుకోండి మీరు ఎన్ని పూజలు చేసినా, ఎన్ని జపాలు చేసినా, ఏమి లాభం లేదు రజోగుణం పెరిగిపోతూ ఉంటుంది. ఎవడికైతే రజోగుణం పెరుగుతుందో, తమోగుణం పెరుగుతుందో వాడికి జ్ఞానం రాదు. ఏ దేవుడు వాడికి సహాయం చేయలేడు. ఇది జ్ఞాపకం ఉంచుకోండి. కొంతమంది ఎంతో తియ్యగా ఉంటారు ఎదుటివాళ్ళను విమర్శించరు వాళ్ళ పని వాళ్ళు చూసుకుంటూ ఉంటారు. వాళ్ళు ఏదైనా చెబితే మంచి మాట చెబుతారు. లేకపోతే మౌనంగా ఉంటారు వాళ్ళు పూర్వ జన్మలో ఎంత తపస్సు చేసి ఉంటారో వాళ్ళు ఈ స్థితికి రావటానికి, ఎంతో తపస్సు చేసినవాడికి గాని వాక్కు నిర్మలంగా ఉండదు. మధురంగా ఉండదు. వాక్కు నిర్మలంగా ఉందంటే, మధురంగా ఉందంటే, అది తేజస్సు తోటి ఉందంటే, అది పదిమందికి ఉపయోగపడుతోంది అంటే, తపస్సు చేసి ఉండాలి పూర్వ జన్మలో, తపస్సు చేసిన మనిషి ఎదుటి వాడిని విమర్శించడు. తన మాట వల్ల ఏదైనా ఉపకారం జరుగుతుంది అంటే మాట్లాడతాడు లేకపోతే మౌనంగా ఉంటాడు. ప్రతీ మనిషికి ప్రారబ్ధం ఉంది, సామాన్యంగా కూలి పని చేసేవాడి దగ్గర నుంచి ప్రధాన మంత్రి వరకు ప్రారబ్ధం ఉంది. ప్రారబ్ధం లేకపోతే శరీరం రాదు. ఈ శరీరాన్ని బట్టే కర్మ అనుభవం వస్తూ ఉంటుంది. ప్రారబ్ధం లేని మనిషి లేడు. మనకు సుఖం వస్తూ ఉంటుంది, కష్టం వస్తూ ఉంటుంది. మనకి ఏమి అవుతుంది సుఖం వచ్చినప్పుడు సంతోషం వచ్చేస్తుంది. కష్టం వచ్చినప్పుడు దుఃఖ పడుతూ ఉంటాం. నేనొక రహస్యం చెబుతాను మీరు మనసులో పెట్టుకోండి. ప్రారబ్ధం అనుభవించేటప్పుడు మనకి కొత్త వాసనలు వస్తాయి. కష్టం వచ్చినప్పుడు ఏమో దుఃఖం వస్తుంది. సుఖం వచ్చినప్పుడు ఏమో గర్వం వచ్చేస్తుంది. రెండు సమానంగా మనం అనుభవించలేము. ఏదైనా సంతోషం వచ్చింది అనుకోండి

మనకి గర్వం వస్తుంది, పొగరుబోతుతనం వస్తుంది. ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి దుఃఖం వస్తుంది. ఈ సంతోషం కూడా ఒక వికారం. ఈ కష్టం కూడా ఒక వికారం. ఇవి రెండు కూడా మనసుకు సంబంధించిన వికారాలు. దుఃఖం వచ్చినప్పుడు మనసు కుంగిపోతుంది. సంతోషం వచ్చినప్పుడు మనసు పొంగిపోతుంది. మీకు దేవుడు ఉన్నాడా దేవుడు లేడా అనేది సమస్య కాదు. నేను చెప్పే దాంట్లో అబద్ధం ఉంటే మీరు చెప్పండి, ఇది మీ అనుభవం. మీకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి కష్టం వచ్చినప్పుడు ఏమి అవుతుంది మనసు కుంగిపోతుంది. సంతోషం వచ్చినప్పుడు ఏమి అవుతుంది? మనసు పౌర్ణమి రోజున సముద్రం పొంగినట్టే పొంగుతుంది. అంటే మనసు పొంగడం, మనసు కుంగిపోవటం ఇలా జరుగుతుంది. అప్పుడు ఏమి అవుతుంది? కొత్త వాసనలు వచ్చేస్తాయి. మనం అందరం పెద్ద భక్తులం అనుకుంటున్నాం, లేకపోతే యోధులం అనుకుంటున్నాం కాని మనం తల్లి కడుపు నుండి బయటకి వచ్చినప్పుడు వంద వాసనల తోటి పుడితే చనిపోయేటప్పుడు రెండు వందల వాసనల తోటి చనిపోతున్నాం. ఇదిజ్ఞాపకం పెట్టుకోండి, ఇంక మనకి మోక్షం ఏమిటి? మనకి శాంతి ఏమిటి? మనకి నిర్వాణం ఏమిటి? ఇది మనకి ప్రాక్టికల్ సైన్సు. ఇది స్పిరిట్యువల్ సైన్సు. ప్రారబ్ధం ఎలా పెరుగుతుంది అంటే ఏ సంఘటన జరిగినా కూడా మనకి మనసులో వికారం వస్తుంది. మనలని ఎవరైనా పొగుడుతారు అనుకోండి మనసులో సంతోషం వచ్చేస్తుంది. సంతోషం కూడా వికారం.

మనలని ఎవరైనా తిడతారు అనుకోండి మనకి దుఃఖం వస్తుంది అది కూడా ఒక వికారమే, దీనివల్ల ఏమి అవుతుంది? మనసులో వికారం వచ్చేటప్పటికి కొత్త వాసన వచ్చేస్తుంది. ఈ కొత్త వాసనలు ఇంకా పెరిగిపోతూ ఉంటాయి. అయితే ప్రారబ్ధం అనుభవించేటపుడు మనసు ఉద్రేక పడకుండా కనుక అనుభవిస్తే ఉన్న వాసనలు కాలిపోతూ ఉంటాయి. అప్పుడు ఏమి అవుతుంది? వాడికి తెలియకుండా వాడికి జ్ఞానం వచ్చేస్తుంది. ప్రారబ్ధం అనుభవించేటపుడు ఆవేశ పడకుండా, ఉద్రేక పడకుండా, శాంతిగా కనుక ప్రారబ్ధాన్ని అనుభవిస్తే, ఉన్న వాసనలు అన్నీ పోయి వాడు జ్ఞాని అయిపోతాడు. మీరు పూజ చెయ్యటం వల్ల జ్ఞానులు అయిపోతారా అంటే నేను పూజ చెయ్యద్దు అని చెప్పటం లేదు మీకు, పూజలు చెయ్యండి అది కూడా సాధన. మీరు ప్రారబ్ధాన్ని ఎలా అనుభవిస్తున్నారో కావాలి. పారబ్ధాన్ని ఎవరైతే శాంతిగా అనుభవిస్తున్నారో, వాళ్లకి ఉన్న వాసనలు పోతాయి. ఎవడైతే చిరాకుగా ఆవేశం తోటి ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాడో వాళ్లకి కొత్త వాసనలు వస్తాయి. అంటే మీరు

ఎమోషన్‌కి గురి కావద్దు. ఏ సంఘటన జరిగిన కూడా ప్రశాంతంగా తీసుకోండి. Strongmind ఎప్పుడూ ఒక weakmindని control చేస్తుంది. ఇది జ్ఞాపకం ఉంచుకోండి. అందుచేత మీరు స్నేహాల విషయంలో మంచి స్నేహాలు చేస్తూ, వాళ్ళకున్న జ్ఞానాన్ని మనం ఆర్జించుకుంటూ వాళ్ళ యొక్క ప్రవాహంలో కనుక మనం ఉంటే వాళ్ళ vibrations పని చేస్తూ ఉంటాయి. మల్లె పువ్వు ఉంటే మల్లె వాసన వస్తుంది. పేడ ఉంటే పేడ వాసన వస్తుంది. అదే విధంగా మంచి వాళ్ళ తోటి, సహృదయం ఉన్న వాళ్ళ తోటి కనుక మనం స్నేహాలు చేయటం వల్ల, వాళ్ళ ప్రభావం మన మీద పడి, మనకి ఎంతో ఆధ్యాత్మిక మైనటువంటి తేజస్సు, వికాసం మనం పొందుతాం. లోకంలో ఏ మంచి పని చేసినా ఏ మంచి ఆలోచన మీకు వచ్చినప్పటికీ అంతా మీకే తిరిగి వస్తుంది. ఏదైనా ధర్మం చేశారు అనుకోండి అది మీకే తిరిగి వస్తుంది. మీరు ఎవరికైనా ఉపకారం చేశారు అనుకోండి అదే మీకు తిరిగి వస్తుంది. ఎవరికైనా అపకారం చేశారు అనుకోండి అదే తిరిగి వస్తుంది. ధర్మం, ధర్మం అంటే ఏమిటి? జ్ఞానమే ధర్మం. ఎవడైతే ధర్మంగా ఉన్నాడో వాడికే జ్ఞానం కలుగుతుంది కానీ నేను ఏదో తపస్సు చేస్తున్నాను, పుస్తకాలు చదువుతున్నాను, కాని అధర్మంగా ఉంటున్నాను అంటే జ్ఞానం వస్తుంది అని మీరు అనుకోవద్దు. పూజ వల్ల, జపం వల్ల, ధ్యానం వల్ల కాదు ధర్మాన్ని ఆచరించిన వారికి జ్ఞానం కలుగుతుంది. భగవంతుని ప్రార్థించేటపుడు ఏమి చెప్పాలి అంటే నాకు వినయాన్ని ప్రసాదించు అని ప్రార్థించాలి. నాలో అవినయం ఉంటే అది పోగొట్టు. నాకు వినయాన్ని ప్రసాదించు నా మనసు ఎప్పుడూ వినయంగా ఉండాలి. అని ప్రార్థిస్తే ఆ మనిషికి తప్పనిసరిగా పల్లంలోకి నీరు వచ్చినట్టు వాడి హృదయంలోకి జ్ఞానం వస్తుంది. మీలో అవినయం ఉందో, వినయం ఉందో భగవంతుడికి తెలుసు. వినయం ఉన్న చోట, విధేయత ఉన్న చోట, శీలం ఉన్న చోట జ్ఞానం తప్పనిసరిగా వస్తుంది. నిజమైన సంపద ఏమిటి అంటే శీలమే. మన ప్రవర్తనే నిజమైన సంపద. దేహ ప్రారబ్ధం బట్టి మీకు కొన్ని భోగాలు రావచ్చు. అవి నిజం అనుకుని మీరు గర్వ పడవద్దు. ఏమైనా కష్టాలు రావచ్చు, అవి నిజం అనుకుని మీరు దుఃఖ పడవద్దు. మీకు ఆధ్యాత్మికంగా అభివృద్ధి ఏమిటంటే, ఒక గంట సేపు ధ్యానం చేస్తున్నామా, పూజ ఏమైనా నాలుగు గంటలు చేస్తున్నామా, ఇవన్నీ బాహ్యంగా చేసే ధ్యానాలు అవి కాదు లెక్క, మీకు కొలత ఏమిటంటే మీ దేహప్రారబ్ధంలో మీకు కష్టం రానివ్వండి, సుఖం రానివ్వండి, ఎంత ప్రశాంతతతో మీరు అనుభవిస్తున్నారో దానిని బట్టి మీకు భక్తి అభివృద్ధి అయినట్టు. ఇది కొలత. ఇదే రమణమహర్షి గారు చెప్పారు. నువ్వు కాశీ వెళితే

మనస్సు నీ కూడా వస్తుంది. హిమాలయ పర్వతాలకి వెళితే మనస్సు నీ కూడా వస్తుంది. నువ్వు చనిపోయి పరలోకానికి వెళితే నీ మనసు నీ కూడా వస్తుంది. నీ మనసు నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. నీ మనసుని దాటుకుని నువ్వు ఎక్కడకు వెళతావు? నీ భర్తను నువ్వు విడిచి పెట్టవచ్చు, నీ ఇల్లుని నువ్వు విడిచి పెట్టవచ్చు, నీ అత్తని, నీ మామని, నీ బంధువుని, అందరిని విడిచి పెట్టవచ్చు కాని నువ్వు ఎక్కడా నీ మనసు విడిచి పెట్టలేవు. నువ్వు స్వర్గానికి వెళ్ళినా, నువ్వు నరకానికి వెళ్ళినా నీ మనసు నీ కూడా వస్తుంది.

"నేను చెడ్డ పనులు చేశాను. నాకు ఇప్పుడు అవసాన దశ వచ్చింది. ఇపుడు నేను నరకానికి వెళ్ళిపోతానేమో అని నాకు భయం వేస్తోంది" అని పెరుమాళ్ళు భగవాన్‌తో అంటే, అప్పుడు భగవాన్ "ఓ పెరుమాళ్ళు, నిజమే నువ్వు నరకానికి వెళ్ళినా నీ కోసం నేను నరకానికి వస్తాను. ఎందుకు? నిన్ను రక్షించటం కోసం" అన్నారు. వాడు గురువు. నాకు పుచ్చుకోవడం చేతనవును కాని ఇవ్వడం చేత కాదు. అందుచేత మీరు ఇస్తూ ఉంటే మేము పుచ్చుకుంటూ ఉంటాం. కాని మీ దుఃఖం మటుకు మేము పుచ్చుకోము మీ దుఃఖంలో మేము వాటా పొందం అంటే వాడు గురువు కాదు. ఎవడైతే నీ దుఃఖాన్ని హరిస్తున్నాడో వాడే గురువు. నీ రూపాయలు హరించేవాడు కాదు ఎవడైతే నీ దుఃఖాన్ని హరిస్తున్నాడో వాడు గురువు. దైవ దర్శనం అయినా కాని బుద్ధి చల్లారదు. మనసు చల్లారదు. ఈ కర్మ ఫలితం అనుభవంలోకి రావాలి, ఇది వేగంగా మీ అనుభవంలోకి వచ్చి బయటకి పోతే మంచిది కాని లోపల చీము ఉన్నంత సేపు అది మీకు పోటు పెడుతూనే ఉంటుంది. అది ఏ డాక్టరు గారో పిండేస్తే, అది బయటకి పోతే అప్పుడు పోటు తగ్గుతుంది కాని లోపల పుండు పెట్టుకుని పైన కొబ్బరి నూనె రాసుకుంటూ ఉంటే లోపల పోటు వస్తూనే ఉంటుంది. అదే విధంగా లోపల మీకు అజ్ఞానం ఉన్నంత సేపు, లోపల అశాంతి ఉన్నంత సేపు దుఃఖం అలా వస్తూనే ఉంటుంది. కర్మ ఫలం అనుభవించవలసినంత కాలం ఎవడిబుద్ధి ఎవడిని సుఖ పడనివ్వదు.

ఎవడికి అయితే గురువు అనుగ్రహం కలిగిందో, శాస్త్రం అనుగ్రహం కలిగిందో, దేవుని అనుగ్రహం కలిగిందో వాడికి తొందరగా కర్మ ఫలితాన్ని అనుభవంలోకి తీసుకువస్తాడు.

**నిష్కామ భక్తి మానవుడిని స్వార్థం నుండి విడుదల చేసి**

**జ్ఞానమును ప్రసాదిస్తుంది.**



ఇది బాగా అర్థం చేసుకోండి. భక్తుల జీవితాలలో ఎక్కువ కష్టాలు అనుభవించినట్టు మనకు కనిపిస్తుంది. ఎక్కువ మంది భక్తుల జీవితాలలో కష్టాలు అనుభవిస్తూ ఉంటే మిగతా వాళ్లకి కష్టాలు లేవు అని కాదు, వాళ్ళ యొక్క ప్రారబ్ధాన్ని వేగంగా వాళ్ళకు అనుభవంలోకి తీసుకువచ్చి, బయటకు లాగి కర్మ ఫలితాన్ని వాళ్ళచేత అతి తేలికగా అనుభవింపచేసి వాళ్ళకు జ్ఞానం ఇవ్వటం కోసం గురువు చేసే పని అది. కర్మ అనుభవించవలసి ఉంటే అది అనుభవించకుండా వాడికి జ్ఞానం రావటానికి అవకాశం లేదు. మనసును అంత సౌందర్యం కనుక మనం చేయగలిగితే జీవించి ఉండగానే అది ఆత్మాకారం చెందుతుంది. మీరు మనసుని సౌందర్యం చేయకుండా, మనసుని పవిత్రం చేసుకోకుండా చనిపోతారు అనుకోండి చనిపోయిన తరువాత ఏమి ఉండదు. ఇవాళ పగలుకి, రేపటి పగలుకి ఈ రాత్రి ఎటువంటిదో, ఈ జన్మకి రాబోయే జన్మకి చావు అటువంటిది. చావు అంటే ఒక నిద్ర అన్నమాట. మనం నిద్రలో ఉన్నట్టే ఉంటుంది చావు అంటే, నిద్రలో మనం ఉన్నాం కాని పని చెయ్యం. భగవంతుడిని మన వేదాలు ఏమి అంటాయి అంటే బ్రహ్మం, బ్రహ్మం అంటాయి. కొంతమంది స్వార్థంకోసం ఇరవై నాలుగు గంటలు కష్టపడి పని చేస్తారు. అలాగే స్వార్థం లేకుండా పరమేశ్వరుడి కోసం, లోక కళ్యాణం కోసం, సమాజం కోసం, నిష్కామంగా ఎవరైనా అలా చేయగలిగితే వాడికి జ్ఞానం కలుగుతుంది. ఎందుచేత అంటే వాడి మీద ఈశ్వరుడికి ప్రీతి కలుగుతుంది. ఈశ్వరుడి యొక్క కరుణ వాడికి కలుగుతుంది. ఈశ్వరుడు కటాక్షించిన క్షణంలో మీకు జ్ఞానం వస్తుంది. మనలో ఈశ్వరుడు ఉన్నాడు. ఇంకా కరుణించటం లేదు అంటే మన మనసు ఇంకా బాగు పడలేదు. మన మనసు బాగు పడింది అంటే వెంటనే కరుణిస్తాడు. ఆయన మన కోసం ఎదురు చూస్తున్నాడు. అందుచేత స్వార్థపరుడు ఎలా అయితే తన సంసారం కోసం, తన దేహం కోసం ఎలా పని చేస్తాడో, అదే విధంగా ఆ పనే మీరు స్వార్థం లేకుండా పని చేస్తే తప్పనిసరిగా ఈశ్వరుడి యొక్క కరుణ మీ మీద పడుతుంది. ఈశ్వరుడి అనుగ్రహం మీ మీద పడుతుంది. ఈశ్వరుడి అనుగ్రహం మీకు రావటం, మోక్షం రావటం ఒకేసారి జరిగిపోతాయి. దీపం వెలిగిస్తే ఇంకో గంటకు వెలుతురు రాదు. దీపం వెలిగించటం వెలుతురు రావటం రెండు ఒకేసారి జరుగుతాయి. అదే విధంగా ఈశ్వరుడి అనుగ్రహం ఎప్పుడైతే వచ్చిందో ఆ క్షణంలోనే మీరు జ్ఞానులు అయిపోతారు. కాలాన్ని మీరు పాడు చేసుకోవద్దు. డబ్బు కంటే విలువైనది కాలం. చనిపోయిన తరువాత మీరు సాధన చేద్దాం అనుకుంటారు అనుకోండి అక్కడ ఏమీ చెయ్యలేరు. భోగ లోకాలు ఉన్నాయి

నరక లోకాలు ఉన్నాయి కాని చనిపోయిన తరువాత మీరు సాధన చేయటానికి అవకాశం లేదు. మళ్ళీ శరీరం రావాలి, మళ్ళీ మనం భూమి మీదకి రావాలి. అప్పుడు ఎటువంటి స్నేహితులు దొరుకుతారో, ఎటువంటి పుస్తకాలు దొరుకుతాయో, ఎటువంటి అవకాశాలు దొరుకుతాయో చెప్పలేము అందుచేత బ్రతికుండగా ఈ జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటే, సమయాన్ని ఉపయోగించు కుంటే ఇంకా మంచి అవకాశాలు వచ్చేటటువంటి మంచి జన్మలని మనకి భగవంతుడు ప్రసాదిస్తాడు. మంచి గురువులు కూడా మనకి దొరుకుతారు. మన మనస్సులో గొప్పతనం లేకపోతే ఎదుటి వాడిలో గొప్పతనం ఉన్నామనకు కనపడదు. ఒక రమణమహర్షిని అర్ధం చేసుకోవాలి అంటే ఇంకో రమణమహర్షి ఉండాలి. ఒక కృష్ణుడిని అర్ధం చేసుకోవాలి అంటే ఇంకో కృష్ణుడు ఉండాలి. ఎందుచేత నాకు అర్ధం అవ్వడు రమణమహర్షి? ఆ చైతన్య స్థాయి నాకు లేదు, నాబుద్ధి అంత వికసించలేదు, నా మనసుకి ఆ అందాలు రాలేదు. ఆ విశాలత్వం రాలేదు. అందుచేత జ్ఞాని నాకు అర్ధం కావటం లేదు. ఇదే వివేకానంద ఒక కథ చెప్పాడు. ఒకసారి సముద్రంలో కప్ప పొరపాటున వచ్చి నూతిలో పడింది. నూతిలో ఉన్న కప్ప నువ్వు ఎక్కడ నుంచి వచ్చావు అని సముద్రంలో నుండి వచ్చిన కప్పని అడిగింది. ఆ కప్ప నేను ఎక్కడ నుంచి వచ్చాను అనుకుంటున్నావు సముద్రంలో నుంచి వచ్చాను అంది. సముద్రంలో నుంచి వచ్చావా? అని ఆ కప్ప ఒక బెత్తుడు దూరం ఉరికి ఇంత ఉంటుందా సముద్రం? అని అడిగింది. అంటే ఏమిటి? సముద్రం ఎప్పుడూ చూడలేదు ఆ కప్ప. దానికి ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియటం లేదు. అప్పుడు కోపం వచ్చింది జాన లెక్క ఉరికి పోనీ ఇంత ఉంటుందా? అని అడిగింది. ఈ కథ ఎందుకు చెప్పారు అంటే, మీకు ఏవో ఊహలు ఉన్నాయి. మీకు నిజం తెలియదు. నాకేవో తలంపులు ఉన్నాయి. నాకు నిజం తెలియదు. మీ కంటే నాకు చదువు ఉంటే మీ కంటే నేను గొప్పవాడిని అనుకుంటున్నాను. మీ కంటే నాలుగు రూపాయలు నాకు ఎక్కువ ఉంటే నేనే గొప్పవాడిని అనుకుంటున్నాను. మీరు మాయలోనే ఉన్నారు. నేను మాయలోనే ఉన్నాను. మనం అందరం ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నాం. మీకు నిజం తెలియదు, నాకు నిజం తెలియదు. నాకు నిజం తెలియకుండా మిమ్మల్ని నిజం దగ్గరకు ఎలా తీసుకు వెళ్ళగలను? భజన వల్ల, పూజ వల్ల, శ్రవణం వల్ల అయిపోదు. ఒక పరిపూర్ణమైన శాంతి, శాశ్వతమైన శాంతి, తరగని శాంతి, అది హృదయంలో నేను అనుభవించాలి. హృదయంలోని శాంతి నాకు ఎప్పుడైతే దొరికిందో, ఆ పరిపూర్ణమైన పూర్ణ స్థితి నాకు ఎప్పుడైతే అందిందో, అప్పుడు

సడెన్‌గా నేను బంధం నుండి బయటపడిపోతాను. హృదయంలో ఉన్న శాంతి నాకు దొరికినప్పుడు బాహ్యసుఖాల కోసం కాని, బాహ్య గౌరవాల కోసం కాని, బాహ్యంలో ఉన్న దేని కోసం నా మనసు depend అవదు. శాంతి కోసం బాహ్యపరిస్థితుల మీద నా మనసు ఆధారపడి ఉండదు. ఎందుచేత దానికి ఎంత శాంతి కావాలో అంతా దానికి లోపల నుంచి supply అవుతూ ఉంటుంది. లోపల సోర్స్‌లోంచి అతి వేగంగా వస్తూ ఉంటుంది. ఎప్పుడైతే నాకు పరిపూర్ణమైన శాంతి కలిగిందో సడెన్‌గా నేను బంధంలోంచి తెగిపోయి బయటకి వచ్చేస్తాను. నేను ఎప్పుడైతే బంధం నుండి బయటకి వచ్చానో అప్పుడు మిమ్మల్ని బంధం నుండి నేను బయటకి తీసుకు రాగలను. ముందు నాకు శాంతి కుదరాలి. నాకు శాంతి కుదిరితే నేను బంధం నుండి బయటకి వస్తాను. నేను బంధం నుండి బయటకి వస్తే మిమ్మల్ని బంధం నుండి బయటకి తీసుకు రాగలను. ఇదే రమణమహర్షి చేసిన పని, రమణమహర్షే బంధం నుండి బయటకి రాలేదు అనుకోండి మనలని ఎలా తీసుకు రాగలడు? మనల్ని తీసుకు రాలేడు. జ్ఞాని అంటే ఏమిటి? వాడికి పరిపూర్ణమైన శాంతి ఉండాలి, పరిపూర్ణమైన శక్తి ఉండాలి. పరిపూర్ణమైన వైరాగ్యం ఉండాలి. పరిపూర్ణమైన జ్ఞానం ఉండాలి. అక్కడ ఏమి అవుతుంది? వాడు బంధం నుండి విడిపోతాడు. అలా విడిపోయిన వాడు మాత్రమే తోటి వాడిని బంధ విముక్తున్ని చేయగలడు. ఇది కేవలం కబుర్ల వల్ల, కాకరకాయ వల్ల, మొక్కు బడి కోసం మాటలు చెబుతుంటే మీకు జ్ఞానం రాదు. నా మాటల వెనకాల ఎంతవరకు జ్ఞానం ఉంది? ఇవి ఎంతవరకు మీకు ఉపయోగపడతాయి అని ఆలోచించుకోవాలి కాని ఏదో గౌరవం కోసం, లాంఛనం కోసం చెబితే మీకు జ్ఞానం కలుగుతుందా? కొంతమంది ఎదుటి వారిని ఎప్పుడూ విమర్శిస్తూ ఉంటారు. మీరు వారి స్నేహాలు చేస్తారు అనుకోండి ఆ విమర్శ అనే అంటురోగం మీకు కూడా పట్టుకుంటుంది. అంటే మీరు కూడా ఎదుటి వాళ్ళని విమర్శించడం మొదలు పెడుతూ ఉంటారు. అటువంటి స్నేహాలు కనుక దొరికితే మీకు తెలియకుండా రజోగుణం పెరిగిపోతూ ఉంటుంది. పాపం చెయ్యాలి అని ఎవరికీ ఉండదు, కాని అందరూ పాపం చేస్తున్నారు. కారణం ఏమిటి అని అర్జునుడు కృష్ణుడిని అడిగాడు. దానికి కామం అని చెప్పారు. కామం ఉన్నంత సేపు మనిషి పాపం చేయటం మానడు. కామం ఎక్కడ నుంచి వస్తుంది? రజోగుణం నుంచి కామం వస్తుంది, కామం నుంచి పాపం వస్తుంది. అయితే ఈ రజోగుణం తగ్గాలంటే ఏమి చెయ్యాలి? తపస్సు ఉండాలి. తపస్సు ఉన్నవాడు

ఎంతసేపు తనలో ఉన్న చెడును తీసేస్తూ ఉంటాడు. సమాజం యొక్క కళ్యాణం కోసం కృషి చేస్తూ ఉంటాడు. ఎదుటి వాడిని విమర్శించడు. ఎదుటి వాడి మనసుకి అందాన్ని తీసుకు రావటం కోసం పని చేస్తాడు. తపస్సు అంటే మీరు భోజనం మానేయటం తపస్సు అనుకోకండి. నిర్మలమైన వాక్కు ఉండాలి, చేతుల తోటి మంచి పని చెయ్యాలి. నోటి తోటి మంచి మాటలు మాట్లాడాలి. మీ మనసుకి మంచి ఆలోచనలు రావాలి. చక్కటి భావాలతో మీరు ధ్యానం చెయ్యాలి. భగవంతుడు ఏది చెబితే అది, భగవంతుడు చెప్పాడు కాబట్టి చెయ్యాలి అంతే కాని దానివల్ల ఏది వస్తుందో అది మీకు వద్దు, ఏది వస్తే అది రాని, దేవుడు చెప్పాడు అంటే మనం చేసేద్దాం. ఆ ధైర్యం, ఆ స్థైర్యం, ఆత్మ ధైర్యం, ఆత్మ స్థైర్యం, ఆత్మ విశ్వాసం, ఆత్మ వికాసం, ఎవడికి అయితే కలిగిందో వాడు ఆత్మసుఖాన్ని పొందుతాడు. వాడు మోక్ష సుఖాన్ని పొందుతాడు. మన వాక్కుని బాగు చేసుకోవాలి, మనసుని బాగు చేసుకోవాలి. ఇంద్రియాలు నిర్మలంగా ఉండాలి. నీ పని మీద నీకు విశ్వాసం, నీ మాట మీద నీకు విశ్వాసం. నీ అభివృద్ధి మీద నీకు విశ్వాసం ఉండాలి. మన పాదాల మీద మనం నిలబడాలి అంటే మనం ఆధ్యాత్మికంగా చైతన్యవంతులు కావాలి. భగవంతుడు చెప్పిన మాట మీద గౌరవం కాని, భగవంతుడు చెప్పిన మాట మీద విశ్వాసం కాని నీకు కలగటం లేదు అంటే లోపల పాపం ఎక్కువ ఉన్నట్టే. దోషం ఉన్నవాడికే ద్వేషం వస్తుంది, దోషం ఉన్నవాడికే భగవంతుడి బోధ అందదు. హృదయంలో దోషం ఉన్నప్పుడే ఇవన్నీ ఉంటాయి. అందుచేత ఎవడికి అయితే లోపల దోషం పోయిందో వాడికి ద్వేషం కూడా రాదు. మాట వేరు దేవుడు వేరు కాదు మాటే దేవుడు. జ్ఞాని కాని దేవుడు కాని తప్పనిసరి అయితేనే మాట్లాడతాడు అనవసరమైన మాటలు వాడి నోటి వెంట రావు. నీతోటి నాకు ఏమి పని లేదు అన్నాడు రమణ స్వామి ఒకరితో, నాతో ఏమి పని లేనప్పుడు నువ్వు నాతోటి ఎందుకు మాట్లాడుతున్నావు అని రమణస్వామిని అడిగితే out of love, out of compassion. ఆ హృదయంలో ఉన్నది దయా సముద్రం, ఉప్ప సముద్రం కాదు. అది ఉప్ప సముద్రం కాదు శాంతి సముద్రం. ఆనంద సముద్రం, దయా సముద్రం. ఇవాళ ఇంకొక మాట జ్ఞాపకం వస్తోంది మీరు ఎవరితోటి అయినా చెబుతారా? వేంపాడులో ఎవరితోటి అయినా చెబుతారా మీరు కృష్ణా, రామా అని కూడా అనక్కర్లేదు, మీకు భూత దయ ఉంటే మోక్షం వచ్చేస్తుంది. Keep it in your heart. నిజమైన భూత దయ కనుక మీకు ఉంటే, ఎనలేని compassion కనుక ఉంటే, పూజ తోటి, నామ జపం తోటి, యజ్ఞం తోటి ఏమి సంబంధం

లేకుండా మీకు జీవుల పట్ల పరిపూర్ణమైన దయ, నిజమైన దయ మీకు ఉంటే, తప్పనిసరిగా మీకు బ్రహ్మం తెలుస్తుంది. దేవుడు ఉన్నాడా? దేవుడు లేడా? అన్న సమస్య కాదు. మీతోటి నాకు పని లేదు. అయితే ఎందుకు మాట్లాడుతున్నావు? అంటే ఆ ప్రతీ మాటలోను దయ తొణికిసలాడుతుంది. ప్రతీ మాటలోను శాంతి తొణికిసలాడుతుంది. జ్ఞాన ధార, ఆ ప్రేమ ధార, ఆ కాంతి ధార, ఆ శాంతి ధార, అమృత ధార ప్రతీ మాటలోను తొణికిసలాడుతుంది. అందుచేత జ్ఞాని నోటి వెంట ఏ మాట వచ్చినప్పటికీ, అది పరమ ప్రమాణం అందుచేత ఆ మాటలు మీరు వేళాకోళంగా కాని, సరదాగా కాని తీసుకోకుండా, ప్రతీ మాటను మీరు ప్రాక్టీస్ చెయ్యండి. ఇంకో ఉపాయం చెబుతాను మీకు భూత దయ లేదు అనుకోండి. లా ప్రాక్టీస్ చేసే వాళ్లకు లా బుక్స్ తోటి, డాక్టర్లకు మెడికల్ బుక్స్ తోటి టచ్ ఉండాలి. అయితే మోక్షం కావాలి అనే వారికి ఏమి అక్కర్లేదు. ఒక చిన్న విషయం. భూత దయ మీకు లేదు అనుకోండి శాంతిని ప్రాక్టీస్ చెయ్యండి, మీకు మోక్షం వచ్చేస్తుంది. సర్వ కాల సర్వ అవస్థల లోను ఎటువంటి పరిస్థితిలోను, మీకు ప్రతికూల పరిస్థితులు వచ్చినా, అనుకూల పరిస్థితులు వచ్చినా, లాయరు ఏ విధంగా అయితే లా ప్రాక్టీస్ చేస్తున్నాడో అలా మీరు శాంతిని ప్రాక్టీస్ చేయండి. శాంతిని అభ్యసించండి మీకు మోక్షం వచ్చేస్తుంది. మీరేమి అనుమానించకండి, అనుమానించేవాడు నశిస్తాడు. ఎవడైతే సందేహిస్తున్నాడో వాడు నశిస్తాడు. మీకు ప్రతికూల పరిస్థితులు రావచ్చు మీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి, అనుకూల పరిస్థితులు రావచ్చు, అనుకూల పరిస్థితులు వచ్చినప్పుడు, ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పుడు మీ శాంతి చెదిరి పోకుండా మీరు నిలబెట్టుకోండి తప్పనిసరిగా మీ మనసుకి గొప్ప సౌందర్యం వచ్చి మోక్షానికి దారి చూపిస్తుంది. మీ మనసు మిమ్మల్ని మోక్ష గుహలోకి, ఆ హృదయ గుహలోకి, ఆ శాంతి గుహలోకి, స్వర్గ రాజ్యంలోకి, ఆ నిర్వాణ స్థితిలోకి, మిమ్మల్ని తీసుకుపోతుంది. అందుచేత శాంతిని ప్రాక్టీసు చేయండి. కృష్ణుడు ఏమి అన్నాడు అంటే నా యందు ఇష్టం లేని వాళ్ళ దగ్గర, నా యందు భక్తి లేని వాళ్ళ దగ్గర నా మాటలు చెప్పవద్దు అని గీతలో చెప్పాడు.



**నీకు వచ్చిన ఈ జన్మను మనోనాశనానికి**
**ఉపయోగించుకుంటేనే ఈ జన్మకి సార్థకత**
**చేకూరుతుంది.**

రత్నాలని, మణులను తీసుకెళ్ళి పందుల దగ్గర పడేయకు. ఆ రత్నం యొక్క విలువ, ఆ మణి యొక్క విలువ పందికి తెలియదు. పైగా దాని కాళ్ళ తోటి తొక్కేస్తుంది అన్నాడు బైబిల్‌లో. మాట యొక్క బరువు తెలియనప్పుడు, మాట విలువ తెలియనప్పుడు అది ప్రాక్టీస్ చేయాలి అని కూడా మనకు అనిపించదు. నేను చెప్పటమే కాదు నేను చెప్పే మాటల వల్ల, మీకు శ్రద్ధ కలిగే బాధ్యత కూడా నేనే తీసుకోవాలి. నేను మాటలు చెబుతున్నాను అనుకోండి మీకు ఎవరికీ శ్రద్ధ కలగటం లేదు అనుకోండి ఆ పొరపాటు నాదే కాని మీది కాదు. నేను చెప్పే మాటల యందు మీకు విశ్వాసం కలగకపోతే ఆ పొరపాటు నాదే కానీ మీది కాదు. దేన్ని శోధిస్తే వస్తుంది మోక్షం? చిత్తాన్ని శోధిస్తే వస్తుంది. మీ మనసులో ఏమి జరుగుతోంది? నువ్వు పరిశీలనగా చూడు. ఎలా చూస్తావు? నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నానో, మీరు నన్ను ఎలా చూస్తున్నారో, అలా మీ మనసులో ఏమి జరుగుతోందో నువ్వు observe చెయ్యి, ఏమి జరుగుతుందో చూడు. ఎటువంటి తలంపులు వస్తున్నాయి? ఎటువంటి భావాలు వస్తున్నాయి? మనసులో ఏమి జరుగుతోందో పరిశీలనగా చూసుకోండి. అలాగే మనసుని మీరు చూసుకుంటూ ఉంటే వచ్చిన తలంపు ఆగిపోతుంది. మనసు మీరు అనుకోవద్దు. మనసుకి సాక్షిగా మీరు ఉండండి. మనసులో ఏమి జరుగుతోందో మీరు చూస్తూ ఉండండి. దాని వల్ల కూడా మీకు ధ్యాన స్థితి కలుగుతుంది. మనసులో ఏమి జరుగుతోందో observe చేయండి. దానివల్ల కూడా మీ మనసుకి ఎంతో సౌందర్యం వస్తుంది. మీ మనసుకి ఎంతో సూక్ష్మత వస్తుంది. మీ మనసు ఎంతో బాగు పడుతుంది. ఎక్కువ తింటున్నామా? తక్కువ తింటున్నామా కాదు. మనకి ఏవో కొన్ని కొన్ని అంటే ఇష్టం, కొన్ని పదార్థాలు అంటే ఇష్టం ఉండదు కదా. అందుచేత నువ్వు ఏది తిన్నప్పటికీ దానిమీద ఇష్టం, అయిష్టంతో సంబంధం లేకుండా సమానబుద్ధి తోటి నువ్వు తింటే అది ప్రసాదం అవుతుంది అన్నారు. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను అంటే ఈ దేహమా మిమ్మల్ని ప్రేమిస్తుంది అన్నారు భగవాన్. దేహం మిమ్మల్ని ప్రేమించటం లేదు. ప్రేమించే వస్తువుకు మరణం లేదు. దేహం మరణించినప్పటికీ ఆ ప్రేమించే వస్తువు అలానే ఉంటుంది. అది ఇప్పుడు ఉంది, అది ఎప్పుడూ ఉంటుంది. ఎందుకని మీరు అనుమానిస్తున్నారు?

దేవుడి స్వరూపం ఎవడు పొందుతాడు అంటే దేహం మరణించక ముందే దేహం నేను అనేబుద్ధి ఎవరిలో అయితే మరణించిందో వాడు దేవుడి స్వరూపం పొందుతాడు. వాడే నిర్వాణ స్థితిని పొందుతాడు. గౌతమ బుద్ధుడు నిన్నటి రోజునే జన్మించాడు. నిన్నటి

రోజునే శరీరం విడిచి పెట్టాడు. నిన్నటి రోజునే బోధి వృక్షం కింద ఆయనకి జ్ఞానం కలిగింది. నిన్నే బుద్ధ పూర్ణిమ. గౌతమ బుద్ధుడు పుట్టి నిన్నటికి 2533 సంవత్సరాలు అయ్యింది. ఈ లోకంలోకి వచ్చి మనం ఏదో నాలుగు మాటలు చెప్పకుని కొంత విజ్ఞాన వంతులం అయ్యాం అంటే గౌతమ బుద్ధుడో, రమణుడో, భగవద్గీత చెప్పిన కృష్ణుడో, వాళ్ళే కారణం. వాళ్ళు ఎంతో తపించి, తపించి, వాళ్ళు తపస్సు చేసి, తపస్సు చేసి, బ్రహ్మం కోసం తపించి, బ్రహ్మం తెలుసుకుని మనం బాగు పడటం కోసం వాళ్ళ యొక్క సుఖంలో వాళ్ళ శాంతిలో మనకి వాటా ఇచ్చారు. ఏ నాటికైనా మనం బాగుపడతాము అని ఎంతో జ్ఞాన వర్షాన్ని మనకి కురిపించారు. అయితే వాళ్ళని మనం గౌరవించటం లేదు సరికదా, వాళ్ళని స్మరించటం లేదు సరికదా, మనస్సులో కృతజ్ఞత భావం కూడా కలగటంలేదు. ఎవరి ఇంటికైనా వెళ్లినప్పడు అన్నం పెడితే, వారి పట్ల మనకున్న కృతజ్ఞత కూడా దేవుడి పట్ల లేదు. జ్ఞాని పట్ల మనకు లేదు. మనం బహుశా వాళ్ళని మరచి పోయాం. గౌతమ బుద్ధుడు జ్ఞాని, యేసు క్రీస్తు జ్ఞాని, శంకరాచార్యుడు జ్ఞాని, రమణమహర్షి జ్ఞాని ఇలా పుస్తకాలలో వాళ్ళు ఉన్న మాట నిజమే కానీ మన హృదయంలో వారికి స్థానం ఇవ్వటం లేదు. పాఠ్య పుస్తకాలలో మిగిలి పోయారు. కృతజ్ఞత అనేది ఎలా ఉంటుందో మనకి తెలియనటువంటి మనుషులం, దేవుడు పట్ల మీరు కృతజ్ఞత చూపించండి. దేవుడు చెప్పిన వాఖ్యాల పట్ల మీరు గౌరవం చూపండి. కృతజ్ఞత చూపండి. మీకు జ్ఞానం కలుగుతుంది. ఆ మాత్రం చేయలేరా? దేవుడి మాటలు అర్థం చేసుకోవడానికి కొంత సమయం ఇవ్వలేరా? మీరు డబ్బు ఇవ్వద్దు, కొంత సమయాన్ని ఇవ్వలేరా? భగవాన్ చెప్పిన మాట మీరు శ్రద్ధగా వినండి. మన మనసులో అనేక వృత్తులు వస్తాయి. దాన్ని చిత్త వృత్తి అంటారు. మనసులో అనేక తలంపులు పుడుతూ ఉంటాయి. తలంపుని బట్టి మాట వస్తుంది. మాటను బట్టి పని చేస్తాం. తలంపు లేకపోతే మాట లేదు, తలంపు లేకపోతే పని లేదు. ఈ తలంపుని ఎవడైతే నిగ్రహించుకుంటున్నాడో అదే యోగం. నిజాన్ని తెలుసుకోవడం కోసం, సత్యాన్ని తెలుసు కోవడం కోసం, చిత్తంలో పుట్టే వృత్తిని ఎవడైతే నిగ్రహించుకోగలుగుతున్నాడో అదే యోగం. అది భక్తి ద్వారానో, ధ్యానం ద్వారానో, కర్మ ద్వారానో మీ పద్ధతిలో మీకు నచ్చిన యోగంలో మీరు మెచ్చిన యోగంలో మీ చిత్త వృత్తిని నిరోధించుకోమని చెప్పాడు. భగవాన్ ఏమి చెప్పారు అంటే తలంపు పుట్టిన తరువాత నువ్వు దానిని నిరోధించుకోవటం కాదు, రోగం వచ్చిన తరువాత మందు పుచ్చుకోవటం కాదు అసలు రోగం రాకుండా చూసుకోవడం మంచిది. చిత్త వృత్తి ఎందుకు పుడుతుందో

భగవాన్ చెబుతున్నారు. నువ్వు ఆత్మవు అయినప్పటికీ, నువ్వు సత్య పదార్థం అయినప్పటికీ నువ్వు కాని దేహాన్ని నువ్వు అనుకుంటున్నావు. నువ్వు కాని అహంకారం నువ్వు అనుకుంటున్నావు. నువ్వు కాని మనసు నువ్వు అనుకుంటున్నావు. నువ్వు కాని దానిని నువ్వు అని ఎంతకాలం అయితే అనుకుంటూ ఉంటావో అంతకాలం నీకు వృత్తులు పుడుతూనే ఉంటాయి. బంధం నిన్ను విడిచి పెట్టదు. ఈ రాకలు, పోకలు, ప్రయాణాలు, తప్పనే తప్పవు. ఎక్కడ రాగ ద్వేషాలు లేవో, ఎక్కడ ఊహలు లేవో, ఎక్కడ తలంపులు లేవో, ఎక్కడ ఆలోచనలు లేవో, ఇవన్నీ లేని చోట సత్య పదార్థం ఎక్కడ అయితే ఉందో అక్కడికి నన్ను మేలుకొలుపు తండ్రీ అన్నాడు గీతాంజలిలో రవీంద్ర నాథ్ ఠాగూర్. కొంతమంది కవులు ఉంటారు వాళ్ళు ఋషులుగా ఉండలేరు. కొంతమంది ఋషులుగా ఉండచ్చు. వాళ్లకి కవిత్వం ఉండదు. రమణమహర్షి ఋషి, కవి కూడా, ఆయన ఎంత ఋషో అంత కవి. ఎంత కవో, అంత ఋషి. ఆయనకి ఎంత కవిత్వం ఉందో మీకు అక్షరమణమాలలో, ఉపదేశ సారంలో తెలుస్తుంది. ఇవి రెండు ఒక చోట మీట్ అయ్యాయి అందుచేత అమృతం వర్షించింది. కవిత్వం ఉంది, ఋషిత్వం ఉంది, ధ్యానం ఉంది, కరుణ ఉంది, భూత దయ ఉంది, ఎన్నో సుగుణాలు కలిసినటువంటి meeting place. Compassion, దయ గల హృదయం కలవాడు. దయగల హృదయం మటుకు సామాన్యమా, మీరు డబ్బు పెట్టి కొనుక్కోగలరా? మీకు అంతస్తులు ఉండచ్చు కాని దయ గల హృదయం మటుకు వస్తుందా? నేను మరొక సారి చెబుతున్నాను. చాదస్తంగా చెబుతున్నాను అనుకోకండి, మీకు కనుక భూత దయ ఉంటే, మీకు ఏమి ఇతర బాహ్య ప్రక్రియల తోటి సంబంధం లేకుండా మీకు మోక్షం వచ్చేస్తుంది. మనం ఇంట్లో అందరి తోటి విడిపోయాం. ఇంక దేనితోటి విడిపోలేదు మనం? అహంకారం తోటి ఇంకా విడిపోలేదు. అహంకారం తోటి ఎప్పుడైతే వేరు పడ్డామో, అహంకారం తోటి ఎప్పుడైతే విడిపోయామో, అందులో కారాన్ని ఎప్పుడైతే విడిచి పెడతామో అప్పుడు ఆత్మ స్థితి కలుగుతుంది. నేను అదో, నేను ఇదో, నేను ఎల్లమ్మనో, పుల్లమ్మనో అనుకుంటాను. లేకపోతే నేను తక్కువ వాడినో, ఎక్కువ వాడినో అనుకుంటాను. కాని వాస్తవమైనది నువ్వు అనుకోవు. ఇదే మాయ. నేను నల్లగా ఉన్నాను అనో, ఎర్రగా ఉన్నాను అనో, i am this, i am that, నేను అది ఇది అనుకుంటున్నావు కాని నేను ఆత్మని అనే భావన మనకు లేదు. మీ జీవితంలో మీరు నూరు సంవత్సరాలు జీవిస్తే కొన్ని సెకన్ల కాలం, కొన్ని క్షణాల కాలం మీరుఆత్మ శాంతిని, ఆత్మ సుఖాన్ని మీరు అనుభవించండి. అపుడు దాని వైభవం తెలుస్తుంది. దాని లోతు

తెలుస్తుంది, దాని అందం తెలుస్తుంది, దాని విశాలత్వం మీకు తెలుస్తుంది. చెడ్డ వాసన వస్తే అక్కడ కుర్చుంటారా మీరు? వెంటనే బయటకు వెళ్ళిపోతారు. దేవుడు మీ హృదయంలో ఉండటానికి మీ మనసులో వచ్చే చెడ్డ వాసనలకి ఎందుకు మీరు దూరం కావటం లేదు. దేవుడు మీ హృదయంలో ఉండటానికి, తగినటువంటి వాసన మీరు ఎందుకు సృష్టించుకోవటం లేదు. ఎందుకు ఆ నోబెల్ thoughtsని, ideal thoughtsని, మీరు ఎందుకు సృష్టించుకోవటం లేదు, దుర్వాసనలకి, దురాలోచనలకి, కుతంత్రాలకి, కుయుక్తులకు ఎందుకు మీరు చోటు ఇస్తున్నారు. వాటికి చోటు ఇస్తే దేవుడు మీ హృదయంలో ఉంటాడా? మీ హృదయంలో దేవుడు ఉన్నాడు. ఈ దేహం దేవాలయం. అటువంటి దేవాలయంలోకి, ఈ దుర్వాసనలని ఎలా రానిస్తున్నారు మీరు? దేహబుద్ధి ఉంది కాబట్టి ఎవరైనా నమస్కారం పెడితే మనలని గౌరవిస్తున్నారు అనుకుంటాం, దేవునికి దేహబుద్ధి లేదు. దేహబుద్ధి లేనప్పుడు ఎన్ని నమస్కారాలు పెట్టినా, ఇంకోటి చేసినా సరే ఒక్కటే, ఎవరికీ? దేవుడికి. ఎందుచేత అంటే అక్కడ మనసు లేదు. గౌరవం అగౌరవం ఇవన్నీ మనసు కల్పిస్తుంది. ఇవన్నీ దాటి వెళ్ళిన వాడు, ఇప్పుడే, ఇక్కడే ముక్తిని పొందుతాడు. మరణించే వరకూ నువ్వు ఆగక్కర్లేదు. ఈ జీవితంలో ఈ శరీరంలో ప్రాణం ఉండగానే నువ్వు దేవుణ్ణి తెలుసుకోవచ్చు. ముక్తిని పొందచ్చు. మనలో ఎవరికి అయినా స్వేచ్ఛ ఉందా? ఈ తలంపు రావద్దు, ఈ తలంపు నన్ను పీడించేస్తుంది. వద్దు వద్దు అంటే అదే వచ్చి నెత్తి మీద పడుతుంది. మనం ఎవరైనా సుఖ పడుతున్నామా? మనకి స్వేచ్ఛ ఉందా? మనకి భయం లేదా చెప్పండి, ఆత్మని తెలుసుకునే వరకూ ఏదో ఒక భయం ప్రతీ మనిషిని పీడిస్తుంది. ఆత్మను తెలుసుకునే వరకు దేవుణ్ణి తెలుసుకునే వరకు భయం వెంటాడుతూనే ఉంటుంది. అమృత స్థితి ఎవరికి అయితే వచ్చిందో, వాడికి తప్పనిసరిగా ఆనందస్థితి వస్తుంది. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి మనం మరణించాం అనుకుంటున్నాం. దేహబుద్ధి ఉంది కాబట్టి మళ్ళీ జన్మించాం అనుకుంటున్నాం. ఈ దేహబుద్ధి ఉన్నంతకాలం నీకు స్వాతంత్ర్యం లేదు, ఆనందం లేదు, శాంతి లేదు, మోక్షం లేదు. దేహం పుట్టినప్పుడు నువ్వు పుట్టాను అనుకుంటున్నావు. దేహం మరణించినప్పుడు నువ్వు మరణించాను అనుకుంటున్నావు. దేహానికి రోగం వస్తే నాకు రోగం వచ్చింది అనుకుంటున్నావు. దేహం ముసలిది అయితే నేను ముసలి వాడిని అయ్యాను అనుకుంటున్నావు. ఎంతసేపు నీ ఆలోచనలు అన్నీ, నీ ఊహలు అన్నీ, నీ తలంపులు అన్నీ, దేహం చుట్టూరే తిరుగుతున్నాయి.

అరుణాచలేశ్వరుడా నువ్వు ఆపరేషన్ చేసి నాకు ఈ దేహబుద్ధిని పోగొట్టావు. ఆత్మబుద్ధిని ఇచ్చావు. నువ్వు చేసినటువంటి ఉపకారం ఇది. అయితే నాకేమి suffering లేదు. నాకేమి బాధ లేదు. ఈ గొప్ప పని నువ్వు చేశావు, నాకు జ్ఞానాన్ని ప్రసాదించావు అరుణాచలేశ్వరుడా.

నీకు బ్యాంకు ఎకౌంటులో డబ్బు లేకపోతే నీ చెక్కు ఏ విధంగా అయితే మారదో, నీకు కనుక జ్ఞానం లేకపోతే మోక్షం రానే రాదు. నీ అకౌంటులో కనుక డబ్బు లేకపోతే చెక్కుకి విలువే లేదు. అదే విధంగా నీకు జ్ఞానం కనుక లేకపోతే మోక్షం రానే రాదు. నీకు జ్ఞానం ఎప్పుడైతే లేదో, నువ్వు మోక్షం గురించి ఆశించక్కరలేదు. అందుచేత మనం ఏ పని చేస్తున్నప్పటికీ, ఏ మాట మాట్లాడుతున్నప్పటికీ, ఏ విషయం మనం ఆలోచిస్తున్నప్పటికీ, మన గమ్యం జ్ఞానాన్నే పెట్టుకోవాలి. జ్ఞానం లేకపోతే మోక్షం రాదు కాబట్టి, జ్ఞానం లేకపోతే అమృత స్థితి రాదు కాబట్టి, జ్ఞానం లేకపోతే శాంతి రాదు కాబట్టి మనకి అది చాలా ముఖ్యం. చాలామంది మాకు శాంతి లేదు శాంతి లేదు అంటారు. శాంతి ఎక్కడో బజారులో దొరుకుతుంది ఏమో అని మనం చూస్తూ ఉంటాం. ఎక్కడుంది శాంతి? మన హృదయం లోనే ఉంది శాంతి, మన మనసును కనుక అంతర్ముఖం చేస్తే, అపూర్వమైనటువంటి, ఉదాత్తమైనటువంటి, ఒక శాంతి మన హృదయం లోంచే మనకు వస్తుంది. అయితే మన మనసు అంతర్ముఖం కాలేక మన మనస్సు లోపలికి దిగలేక శాంతి ఎక్కడో బయట ఉంది మనకి బాహ్యంగా దూరాన ఉంది అని అనిపిస్తూ ఉంటుంది. శాంతి ఎక్కడుంది? మన హృదయంలోనే ఉంది. మోక్షం ఎక్కడుంది? మన హృదయంలోనే ఉంది. అమృత స్థితి ఎక్కడుంది? మన హృదయంలోనే ఉంది. ఆనందం ఎక్కడుంది? మన హృదయంలోనే ఉంది. కానీ మనం ఎక్కడ వెతుకుతున్నాం? బాహ్యంగా వెతుకుతున్నాం. అందుచేత గురువు అనేవాడు చేయవలసిన పని ఏమిటంటే నీ మనసుని అంతర్ముఖ పరచాలి. సుఖం ఎక్కడుందో, శాంతి ఎక్కడుందో, అక్కడకు తీసుకువెళ్ళేవాడే గురువు. ఏ స్థానంలో నువ్వు అమృత స్థితిని పొందుతావో అక్కడికి నిన్ను డైరెక్ట్ చేసేవాడు మటుకే గురువు. ఆధ్యాత్మిక విషయాన్నీ మనం చదివి అర్థం చేసుకోవడానికి కూడా మన హృదయంలో చాలా పవిత్రత ఉండాలి. సృష్టి చివరి వరకు నిలబడేది అద్వైత సిద్ధాంతం. ఈ సృష్టి యొక్క ప్రవాహంలో అన్ని సిద్ధాంతాలు కరిగిపోతాయి,

**దేహం మరణించినా, నేను ఉంటాను అనే అనుభవం**

**కలగాలి. అదే అమృతానుభవం.**



ఈ సృష్టి అంతా ఏమిటి అంటే ఒక బిజినెస్ ఇది. మన శరీరాలు పడిపోయినప్పటికీ ఈ సృష్టి యొక్క వ్యాపారం జరుగుతూనే ఉంటుంది. కాని ఎవడికి అయితే జ్ఞానం కలిగిందో వాడు మటుకే ఈ వ్యాపారం నుండి బయటకు వస్తాడు. ఎండగా ఉంది అంటే నువ్వు గొడుగు వేసుకుని వెళ్ళాలి కాని ఆ ఎండని నువ్వు ఆపు చేయలేవు. గొడుగు వేసుకుని వెళితే ఆ ఎండ దెబ్బ తగలకుండా రక్షించుకోగలవు కాని ఆ ఎండ రాకుండా నువ్వు ఆపు చేయలేవు. అదే విధంగా ఈ సృష్టి యొక్క వ్యాపారం అనంతంగా జరుగుతూనే ఉంటుంది. ఈ సృష్టి వ్యాపారానికి అంతులేదు. కాని ఇందులోంచి నువ్వు బయట పడాలి అనుకుంటే నువ్వు జ్ఞానం సంపాదించు నువ్వు అమృత స్థితిని పొందు, నువ్వు ఎప్పుడైతే జ్ఞానం సంపాదించావో, అపుడు వెంటనే ఈ సృష్టి వ్యాపారం నుండి బయట పడిపోతావు. కొంతమంది మనుషులు మాట్లాడుతుంటే బర్నింగ్ వస్తుంది. సోదరమహాశయులారా! అజ్ఞానం నుండి మంట వస్తుంది కాని జ్ఞానం నుండి మంట రాదు. బర్నింగ్ అనేది అజ్ఞానం నుంచి వచ్చేదే కాని జ్ఞానం లోంచి మటుకు రాదు. జ్ఞానం లోంచి ఏమి వస్తుంది అంటే శాంతి వస్తుంది. ఆనందం వస్తుంది. సంతోషం వస్తుంది. మీ హృదయానికి, మీ మనసుకి, మీ ఇంద్రియాలకి, మీ శరీరానికి, చల్లదనాన్ని ఇస్తుంది. ఇది జ్ఞానానికి, అజ్ఞానానికి ఉన్న తేడా. ప్రపంచంలో అనేక సిద్ధాంతాలు ఉన్నాయి. ఈ సిద్దాంతాలు అన్నీ కరిగిపోతాయి. కాలప్రవాహంలో అన్నీ కుడా రాలిపోతాయి. కాని సృష్టి చివరి వరకు నిలబడేది ఒక్కటే సిద్ధాంతం. అది ఏమిటంటే అద్వైత సిద్ధాంతం. అయితే అద్వైత సిద్ధాంతం గురించి మీరు ఇలా చెప్పారు కదా, మీరు మా భారతీయ గ్రంధాలలో, అద్వైతం గురించి చెప్పే గ్రంధాలలో, మీరు ఏమైనా చదివారా అని Einsteinని అడిగితే, Einstein అంతటి వాడు, అంత మహా మేధావి శంకరాచార్యులు రాసినటువంటి వివేక చూడామణి నేను చదివాను. చదవటం చదివాను. నాకు ఎంత వరకు అర్ధం అయ్యింది అని మీరు అడగకండి నాకు సరిగా అర్ధం అవ్వలేదు అని చెప్పాడు. ఆత్మను తెలుసుకోవాలి ఆత్మను తెలుసుకోవాలి అంటే అర్ధం ఏమిటంటే, నువ్వు ఆత్మ అవ్వాలి. అయితేనే కాని నీకు ఆత్మ తెలియబడదు. తెలుసుకోవటం అంటే అవ్వటం. అది మీరు గ్రహించవలసిన విషయం. ఉన్నది ఒక్కటే వస్తువు. అదే ఈ సృష్టిని అంతా నడిపిస్తోంది. మనిషి యొక్క రాగ ద్వేషాల బట్టి సృష్టి నడవటం లేదు. ఏదో ఒక ఉన్నతమైన శక్తి ఈ సృష్టిని సక్రమంగా నడిపిస్తోంది అన్న సంగతి ఏ మాత్రం మనకిబుద్ధి ఉన్నప్పటికీ, ఏ మాత్రం మనకి తెలివి ఉన్నప్పటికీ ఆలోచిస్తే ఏదో ఒక శక్తి ఈ సృష్టిని అంతా నడిపిస్తోంది. ఎంతో క్రమబద్ధంగా నడిపిస్తుంది అని మనకి

స్పష్టంగా తెలుస్తుంది. ఈ సృష్టిని అంతా నడిపించే శక్తి, ఆ శక్తి ఎక్కడో నీకు దూరాన లేదు. ఆ శక్తి యొక్క అంశ నీ హృదయంలో ఉంది. నీ హృదయంలో ఉన్న ఆ శక్తిని నువ్వు అర్థం చేసుకుంటే ఈ సృష్టిని నడిపే శక్తి అంతా నీకు అర్థం అవుతుంది. అయితే ఈ ప్రపంచంలో ఉన్నటువంటి రాగ ద్వేషాలు, ఈ ప్రపంచంలో ఉన్నటువంటి కామ క్రోధాలు, ఇవన్నీ జయిస్తేనే కాని ఆ శక్తి దగ్గరకు వెళ్ళలేము. మనం దేవాలయాలకి వెలుతూ ఉంటాం. ఎదురుగా ఏమి కనిపిస్తుంది అంటే పెద్ద గోపురం కనిపిస్తుంది. ఆ గోపురం లోంచే లోపలికి వెళ్ళాలి శివుడి దగ్గరకు, అలా ఈ ప్రపంచం అనే గోపురాన్ని దాటితేనే కాని మనకి శివుడు దొరకడు. ఈ ప్రపంచం అనే గోపురం? మనకి life and derivatives. మన మనసు కూడా ప్రకృతే. మన మనసు కూడా నిజం కాదు, మన మనసు కూడా అబద్ధమే. మనసు కూడా అబద్ధం కాబట్టి నువ్వు మనసుని జయించమంటున్నాడు. మనం అబద్ధాన్ని జయించగలం కానీ నిజాన్ని జయించలేము. అందుచేత నీ మనసు కూడా అబద్ధమే కాబట్టి నీ మనసుని జయించమని చెబుతున్నాడు. మనసు యొక్క మూలం తెలుసుకోమని రమణ స్వామి చెప్పటంలో ఉద్దేశం అదే, మనసు యొక్క మూలం తెలిస్తేనే గాని నీకు మనసు నశించదు. అందుచేత నువ్వు ధ్యానం చేసినప్పటికీ, ఆ ధ్యానం చేసేవాడు ఎవడో నువ్వు పరిశీలన చేసుకో, ధ్యానం చేసేవాడు కనుక ధ్యానంలో కరగకపోతే నువ్వు పరమ స్థితిని పొందలేవు. ఆ ధ్యానం చేసేవాడి యొక్క స్వరూపం నీకు తెలియకపోతే ఈశ్వర స్వరూపం నీకు తెలియబడదు. మీ స్వరూపాన్ని తెలుసుకోవడానికే మీరు ప్రయత్నం చేస్తున్నారు. దానికి దేవుడు అని పేరు పెట్టారు. మీ స్వరూపాన్ని తెలుసుకోవడానికే మీ ధ్యానం యొక్క ప్రయత్నం. మీ పూజ యొక్క ప్రయత్నం అందుకే, మీ స్వరూపాన్ని తెలుసుకోవడానికే ఈ ప్రయత్నాలు అన్నీ కూడా కాని మీ స్వరూపాన్ని మీరు దేవుడు అనుకుంటే నాకు అభ్యంతరం లేదు. మీరు దేవుడు అని అనుకోవచ్చు. లేకపోతే శక్తి అని అనుకోవచ్చు. లేకపోతే ఈశ్వరుడు అని అనుకోవచ్చు, లేకపోతే అల్లా అని అనుకోవచ్చు. ఏదో మీకు ఇష్టం వచ్చిన పేర్లు పెట్టుకుని మీరు అనుకోవచ్చు. మిమ్మల్ని ఎవరైనా విమర్శించారు అనుకోండి మీకు కంగారు పుడుతోంది అంటే మీ భక్తిలో బలం లేదు అన్నమాట. మీరు ప్రపంచంలో ఉండచ్చు కానీ మన యొక్క గమ్యం ప్రపంచం కాదు. మనం బళ్ళోకి ఎందుకు వెలుతున్నాం ఏదో పాఠాలు చదువుకుని ట్రైనింగ్ అవ్వటానికి వెడుతున్నాము. అదే విధంగా ఈ ప్రపంచంలోకి కూడా ట్రైనింగ్ అవ్వటానికే మనం వచ్చాం. ఈ ప్రపంచం కూడా ఒక బడి లాంటిదే. ఇందులోంచి ట్రైనింగ్ అయ్యి బయట పడాలి. ఆత్మను తెలుసుకోవటమే ప్రపంచంలో

ట్రైనింగ్ యొక్క లక్ష్యం. భగవంతుడు మనకి ఒక అవకాశాన్ని ఇచ్చాడు. ఈ అవకాశాన్ని విడిచి పెట్టుకుంటే మళ్ళీ ఈ అవకాశం వస్తుందో రాదో చెప్పలేము. ఈ ప్రపంచంలో ట్రైనింగ్‌కి వచ్చాం కాబట్టి ఈ ట్రైనింగ్ ని మనం సక్రమంగా ఉపయోగించుకుని మన ఆత్మను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. స్వామి శివానంద ఏమి చెప్పేవారు అంటే నీకు కనుక దేవుడే కావాలి అంటే ఈ ప్రపంచాన్ని త్యాగం చెయ్యి. సిమెంటు తోటి ఒక కుక్కను చేశారు అనుకోండి మసక చీకట్లో మీరు చూసినప్పుడు మీకు అది ఎలా ఉంటుంది? నిజంగా కుక్క కింద ఉంటుంది. కానీ అది సిమెంటు తోటి చేశారు. లైటు పట్టుకెళ్లి చూస్తే ఏమి కనిపిస్తుంది అది నిజమైన కుక్క కాదు. ఊరికే కుక్క కింద కనిపిస్తోంది అనుకుంటారు. మీకు అది కుక్క కింద కనిపించినప్పుడు ఆ రాయి మీకు కనపడదు. రాయి కనిపించినప్పుడు మీకు కుక్క కనపడదు. అదే విధంగా మీకు ఆత్మ దర్శనం అయినప్పుడు మీకు ప్రపంచమే లేదు. మీకు ప్రపంచబుద్ధి ఉన్నప్పుడు, దేహబుద్ధి ఉన్నప్పుడు, మీకు ఆత్మ తెలియబడదు, ఆత్మ తెలియబడదు. కేవలం పుస్తక జన్య జ్ఞానం వల్ల ఆత్మ తెలియబడదు. పుస్తకాలలో ఆత్మ లేదు, నీ హృదయంలో ఆత్మ ఉంది. భగవంతుడు ఏమి చెప్పాడు? నేను పుస్తకంలో ఉన్నాను అని చెప్పాడా? హృదయంలో ఉన్నాను అని చెప్పాడా? అయితే మనలను గైడ్ చేయటానికి పుస్తకాలు ఉపయోగపడతాయి కాని, దేవుడు మటుకు మన హృదయంలోనే ఉన్నాడు. మన హృదయాన్ని పిండితే భగవంతుడు తెలుస్తాడు కాని పుస్తకాలు పిండితే భగవంతుడు తెలియబడడు. అందుచేత మరీ మరీ ఇక్కడ గ్రహించవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే నువ్వు ఏ పని చేసినప్పటికీ, ఏమాట మాట్లాడినప్పటికీ, నీకు ఏ ఆలోచన వచ్చినప్పటికీ అది ఎంత వరకు నిన్ను పవిత్రున్ని చేస్తోంది అని చూసుకో. నువ్వు చేసే పూజ వల్ల ఎంతవరకు నువ్వు పవిత్రుడవు అవుతున్నావు. నువ్వు చేసే జపం వల్ల నువ్వు ఎంతవరకు పవిత్రుడవు అవుతున్నావు. నువ్వు చేసే ధ్యానం వల్ల ఎంతవరకు నువ్వు పవిత్రుడవు అవుతున్నావు. పవిత్రత అనేది నువ్వు చూసుకో కాని అది చేశాను ఇది చేశాను అంటే అడవిలో కాసిన వెన్నెల లాగా ఉంటుంది. ఏమి ప్రయోజనం లేదు. సోదరమహాశయులారా! ఒక విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. నేను చెప్పినవి కనుక మీరు నిజంగా ఆచరణలో పెడుతూ ఉంటే మీ ఇంట్లో వాళ్ళే ముందు మీకు శత్రువులు అవుతారు. ఈ సత్యాన్వేషణ ఊరికే సరదాగా అలా కాలక్షేపానికి ఉంటే ఫరవాలేదు. కాని ఎవడైతే నిజమైన సత్యాన్వేషకుడో, ఎవడైతే సత్యాన్వేషణలోకి దిగాడో మొట్ట మొదట్లో వాడికి ఇంట్లో వాళ్ళు శత్రువులు అవుతారు. గ్రామస్తులు శత్రువులు అవుతారు.

అంతా శత్రువులు అవుతారు. అలా ఎంత శత్రుత్వం వచ్చినప్పటికీ సత్యాన్ని దృష్టిలో పెట్టుకుని, సత్యాన్నే goalగా పెట్టుకుని, సత్యాన్ని destinationగా పెట్టుకుని, నువ్వు చలించకుండా ఉండగలిగితే అప్పుడు నువ్వు సక్సెస్ అవుతావు. కాని భయం అనేది నీ హృదయంలో ఏ మూలన ఉన్నప్పటికీ నీకు సత్యం తెలియబడదు. సోదరమహాశయులారా బలహీనులకు కాని బద్ధకస్తులకి కాని ఆత్మ సాక్షాత్కారం కాదు. సత్య సాక్షాత్కారం కాదు అని కఠోపనిషత్తులో ఒక ఋషి చెప్పాడు. నిజంగా సత్యాన్వేషణ కనుక మీరు ప్రారంభిస్తే march forward, look forward, go forward, no need of look behind అన్నారు స్వామీజీ. నువ్వు వెనక్కి తిరిగి చూడవలసిన పని లేదు. ఆ మార్గం నువ్వు నిజంగా నమ్మినప్పుడు నీలో sincerity ఉన్నప్పుడు ఆ మార్గంలో నువ్వు ప్రయాణం చెయ్యి, వెనక్కి తిరిగి చూడకు. సత్యం కోసం నువ్వు తపిస్తుంటే, సత్యం కోసం నువ్వు జీవిస్తుంటే, అదే నిన్ను వచ్చి వరిస్తుంది. నీ శిరస్సు మీద వాలుతుంది. దాని స్వరూపాన్ని నీకు ఇస్తుంది. అయితే బద్ధకస్తులకి, బలహీనులకి మటుకు అది తెలియదు. పిరికితనం వల్ల ఇది తెలియబడదు. దీనికి ఎంతో ధైర్యం ఉండాలి. దీనికి ఎంతో ఆత్మ విశ్వాసం ఉండాలి. మనకి ఆత్మ విశ్వాసం లేదు కాని ఆభరణాలు ఉన్నాయి. బంగారం మీద మనకున్న వ్యామోహం ఆత్మ మీద మనకి లేదు. అందుచేత ఆత్మ విశ్వాసం లేకపోతే మనకి ఆత్మ తెలియబడదు. అందుచేత నువ్వు ముందు ఆత్మనే ఆదర్శంగా పెట్టుకో, అది నువ్వు goalగా పెట్టుకో, దానిని నువ్వు సాధించు. నీ ఆదర్శం ఏమిటి? దేనిని పొందాలి అని నువ్వు ప్రయత్నం చేస్తున్నావు? అది ముఖ్యం. ఆ ఆదర్శం కనుక సరైనది కాకపోతే అది నేరం, అది తప్పు. నీ ప్రయత్నంలో ఫెయిల్ అవ్వడం తప్పు కాదు. Truthని idealగా పెట్టుకోవాలి. అది కనుక idealగా పెట్టుకోకుండా నాకేదో మంచి జన్మ రావాలి. నేనేదో స్వర్గ లోకానికి వెళ్లిపోవాలి. ఆ లోకానికి వెళ్లిపోవాలి. ఈ లోకానికి వెళ్లిపోవాలి అని తాత్కాలికం అయినటువంటి, మళ్ళీ నీకు ఈ ప్రకృతి లోకి వచ్చేటటువంటి, ఈ చిన్న చిన్న స్వల్ప విషయాలను, అల్ప విషయాలను కనుక మీరు ఆదర్శంగా పెట్టుకుంటే అది నేరం, అది తప్పు, అది పాపం. కాని మీరు ఫెయిల్ అవ్వడం మటుకు తప్పు కాదు. మీరు ఆదర్శంగా ఒక ఉన్నతమైన ఆత్మను తీసుకోండి, ఒక భగవంతుడిని తీసుకోండి, అది మనసులో పెట్టుకుని అది పొందటం కోసం, దానిని తెలుసుకోవటం కోసం మీరు ప్రయత్నం చేయండి. అందులో ఒకవేళ మీరు ఫెయిల్ అవుతారు అనుకోండి ఫెయిల్ అయినా ఫరవాలేదు అది నేరం ఏమి కాదు. కాని ఆదర్శంలో కనుక తప్పు ఉంటే అది మటుకు నేరం అని ఒక ఫ్రెంచ్ educationist చెప్పాడు.

# సమస్యల నడుమ నిశ్చింతగా ఉండగలగటమే గొప్ప లక్షణం

ఒక్కో సారి భగవంతుడు, మన జన్మాంతర కర్మ, పూర్వకర్మ, మనకి ప్రారబ్ధరూపంలో కేటాయిస్తాడు. చెరుకు గడని యంత్రం ఎలాగైతే పిండి చేసి రసం తీస్తుందో, అలా జీవితాన్ని కూడా ప్రారబ్ధం పిండుతుంది. ప్రారబ్ధాన్ని మనం విసుగు లేకుండా, చిరాకు లేకుండా, శాంతిగా ఫేస్ చెయ్యాలి. అంటే జీవితంలో, డే టు డే లైఫ్‌లోని (దైనందిన జీవితంలోని), క్లిష్ట సమస్యలని మనం ఫేస్‌చెయ్యలేకపోతే మనస్సు పురోగతి అవ్వదు, అంతర్ముఖం అవ్వదు. మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తే సంతోషం వస్తుంది, విమర్శిస్తే దుఃఖం వస్తుంది - అంటే మీకు అసలు ఆధ్యాత్మిక స్థాయి లేదని, అంటే కనీసం LKG స్థాయి కూడా లేదని అర్థం. పుస్తకాలలో ఏముంది! లైఫ్‌ని ఫేస్ చెయ్యాలి, ప్రారబ్ధాన్ని ఫేస్ చెయ్యాలి. ప్రారబ్ధం కొట్టే దెబ్బలని తట్టుకోవాలి. కొంతమంది జీవితాలలో సమస్యలు తక్కువ ఉంటాయి, వాళ్ళ జీవితాలు అలా వెళ్ళిపోతాయి. కొంతమందిని ప్రారబ్ధం అనేక దెబ్బలు కొడుతుంది, అవి తట్టుకోవాలి. అనేక కష్టాలు, సమస్యలు ఈ డొమెస్టిక్ లైఫ్‌లో (కుటుంబ జీవనంలో) వస్తూ వుంటాయి. అవి ఫేస్ చెయ్యలేకపోతే మనం జీవితం నుంచి పారిపోవలసి వస్తుంది.

పురుషుడు అంటే మీరాబాయి చెప్పిన నిర్వచనం ఏమిటంటే - అందరి హృదయాలలో నారాయణుడు అంతర్యామిగా ఉన్నాడు. వాడే నారాయణుడు. వాడే మనకి డ్రైవర్. లోపల ఉండి కర్మానుసారం జీవితాన్ని నడిపేవాడు నారాయణుడే. వాడు ఒక్కడే పురుషుడు. మిగతా మొగ శరీరాలు ధరించిన వాళ్ళు అందరూ కూడా స్త్రీలే. ఆ నారాయణుడిని ఎవరైతే పొందగలుగుతారో, ఆ నారాయణ స్వరూపాన్ని ఎవరైతే పొందుతారో, వాళ్ళు మాత్రమే పురుషులు. శాస్త్రములో ఏమని ఉందంటే వివేకవంతులు వైరాగ్యవంతులు, అపారమైనటు వంటి ధైర్యం కలవాళ్ళు, ఎంతో సఫరింగుని కూడా సహించగలిగిన వాళ్ళు, కొండలలాంటి సమస్యలు ఎదురైనా ఎదురు నిలబడగల వాళ్ళు, వాళ్ళు మాత్రమే పురుషుడిని పొందుతారు. బద్ధకస్తులు, పిరికివాళ్ళు, వివేకము లేనివాళ్ళు పురుషుడిని పొందలేరు అని కఠోపనిషత్తు చెప్పింది. మనవన్నీ జనరల్‌గా చిన్నచిన్న సమస్యలు. పెద్దపెద్ద సమస్యలను కూడా గడప ఎలా దాటుతామో అలా దాటగలగాలి.

మీరు గాంధీ చరిత్ర, లింకన్ చరిత్ర - ఇలా కొన్ని జీవిత చరిత్రలు చదివితే, పెద్దపెద్ద సమస్యలను వాళ్ళు ఎలా ఫేస్ చేసారో మీకు తెలుస్తుంది. జీవితంలోనుంచి పారిపోతే

ఎలాగ? ఎంతో దారిద్ర్యాన్ని అనుభవిస్తూ కష్టపడి స్వయంకృషితో పెద్దవాళ్ళు అయిన వారు ఉన్నారు. కష్టాలు భరించలేక జీవితంలో నుంచి పారిపోతే పెద్దవాళ్ళు ఎలా అవుతారు? అంటే తలుపు సందున పెట్టి మనిషిని నొక్కినట్టు, ఒకోసారి ఎటు చూసినా కష్టాలే కనిపిస్తాయి! మనకి ఎవరూ పరిష్కారం చేసేవాళ్ళు లేరేమిటి అని మనకి అనిపిస్తుంది. ఆ సందర్భంలో మనం మరిచిపోయేది ఒకటే - భగవంతుడు ఒకడు ఉన్నాడు! దేర్ ఈజ్ ఈశ్వర! ఆయన అందరి కంటే శక్తివంతుడు, అందరినీ పరిపాలించేవాడు. మొత్తం సృష్టి అంతా ఆయన చేతిలో ఉంది. ఈ సమస్యలని పరిష్కరించేవాడు ఒకడు ఉన్నాడు అని ఆ ఈశ్వరుడిని మరిచిపోవటం వల్ల మనకి వర్రీ వస్తుంది. అంటే మీరు ఎన్ని వేదాంత పుస్తకాలు చదివినా జీవితంలో ముఖ్యమైనది మనం సమస్యల మధ్య జీవిస్తూనే ఏ రకమైన వర్రీ రానివ్వకూడదు - జీవితంలో సమస్యలని మీరు విడిచిపెట్టి ఎక్కడికీ పారిపోకూడదు. అవే పరిష్కరించ బడతాయి. మనం పరిష్కరించలేని సమస్యలని కాలం పరిష్కారం చేస్తుంది. కాలం అనేక పెద్ద పెద్ద సమస్యలని పరిష్కారం చేసింది.


ఇంతకీ మీకు ఈ విషయాలు ఎందుకు చెపుతున్నాను అంటే, మనలో కొంత ప్రాక్టికాలిటి (ఆచరణ) కూడా ఉండాలి (అన్నారు శ్రీనాన్నగారు). ది గ్రేటెస్ట్ థింగ్ ఈజ్ టు స్టాప్ వర్రీయింగ్! (The greatest thing is to stop worrying!) మీకు జీవితంలో ముఖ్యమైన పాఠం ఏమిటంటే అన్ని సమస్యల మధ్యన వర్రీ లేకుండా ఉండగలగాలి (నిశ్చింతగా ఉండగలగాలి).


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహత్మ్యం అక్షరమణమాల

**మొగ్గ పరపి నను బట్టబయట నీవు**

**నట్టాడుటేలకో అరుణాచలా ।85।**

**తాత్పర్యము:** నా అహంకారాన్ని నాశనము చేసిన నీవు నా హృదయములో నాట్యము చేయుట మాని అలా బయట తారాడుతున్నావేమిటి అరుణాచలా!

మొగ్గ పరపి అంటే నా ఆధారాలన్నీ ఊడగొట్టి నన్ను బోడి చేసావు అంటున్నారు అక్షరమణమాలలో భగవాన్. నా అహంకారం యొక్క పునాదులను తీసేసి. నా అజ్ఞానాన్ని తీసేసి, బట్ట బయట నీవు నట్టాడుట ఎందుకో అంటున్నారు.

నన్ను నగ్నం చెయ్యి, నాలో ఉన్న వాసనలను, సంస్కారాలను, బలహీనతలను అన్నింటిని కాల్చి బూడిద చేసేయి. నన్ను బోడి చేసి, అహంకారం లేని స్థితికి తీసుకువెళ్ళు. నన్ను బోడి చెయ్యి అంటే అహంకారం లేని స్థితిని ప్రసాదించు. ఎప్పుడైతే నన్ను అహంకార రహితుడిని చేసావో, అజ్ఞానరహితుడిని చేసావో, కాలుష్య రహితుడిని చేసావో, ఎప్పుడైతే నా మచ్చలు అన్నీ తీసేసావో, అప్పుడు నువ్వు ఏమి చేస్తావంటే 'నట్టాడతావు' అంటే నాట్యం చేస్తావు.

చిదంబరం ఎక్కడ ఉంది? మన హృదయంలోనే చిదంబరం ఉంది. చిదంబరంలో ఈశ్వరుడు నాట్యం చేస్తూ ఉంటాడు. చిదంబరం వెళ్ళిన వాళ్ళు చూసే ఉంటారు. అది ఆనంద నాట్యం. అది శాంతి నాట్యం. నేను అహంకార రహితుడిని కనుక అయితే, నీ దయ వల్ల నా అహంకారం పోగొట్టుకోగలిగితే, అప్పుడు నువ్వే నా హృదయంలో నాట్యం చేస్తూ ఉంటావు. అది ఏమి నాట్యం? శాంతి అనే నాట్యం, ఆనందం అనే నాట్యం. నా హృదయంలోనే ఉన్నావు నువ్వు. నేను పోతేనే, నన్ను నేను పోగొట్టుకుంటేనే నువ్వు

దొరుకుతావయ్యా! నన్ను నేను పోగొట్టుకోవాలి, ఎప్పుడైతే నా అహంకారం నిర్మూలన అయ్యిందో, నా అజ్ఞానం ఎప్పుడైతే బూడిద అయిపోయిందో, నా అజ్ఞానం ఎప్పుడైతే మట్టి అయిపోయిందో, అప్పుడు నా హృదయంలో నువ్వు నాట్యం చేస్తుంటావు. అప్పుడు ఆనందం అంటే ఎలా ఉంటుందో, ఆ శాంతి స్వరూపం ఎలా ఉంటుందో, ఆ కాంతి స్వరూపం ఎలా ఉంటుందో అప్పుడు నాకు అనుభవంలోకి వస్తుంది. నేను బోడిని అయినప్పడే నాకు అది తెలుస్తుంది. బోడి అంటే ఈ జుట్టు తీసేయటం అని అనుకోకండి. అది అహంకారం లేని స్థితి.

సుఖం అనుభవించాలి అంటే, శాంతి అనుభవించాలి అంటే, ఆనందం అనుభవించాలి అంటే ఒక్క జ్ఞానికే సాధ్యం. సుఖం అనేది ఎలా ఉంటుందో, శాంతి అనేది ఎలా ఉంటుందో, ఆనందం ఎలా ఉంటుందో, సత్యం మీకు అనుభవంలోకి వచ్చినప్పడే తెలుస్తుంది. ఆ ఆనందం ఎంత అద్భుతంగా ఉంటుందో, ఎంత అపూర్వంగా ఉంటుందో, ఎంత ఉదాత్తంగా ఉంటుందో, ఎంత నిర్మలంగా ఉంటుందో!, దానికి అంత వైభవం ఉండబట్టే భగవాన్ ఈమాట అన్నారు - బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు, శివదేవుడు ముగ్గురు కలిసి వచ్చి మిమ్మల్ని ఏమైనా కోరుకోమంటే కోరుకుంటారా, అని భగవానుని అడిగితే, తప్పనిసరిగా కోరుకుంటాను అన్నారు. ఏమని కోరుకుంటారు అంటే, మీరు ఎప్పుడు కనిపించవద్దని. అంటే సృష్టిని దాటి ఎలా ఉన్నారో చూడండి భగవాన్. కొంతమంది నాకు దేవుడు కనపడటం లేదండి, నాకు దేవుడు కనపడటం లేదండి అంటారు. మీకు రాముడు కనిపిస్తాడు అనుకోండి ఎంతసేపు చూస్తారు మీరు, అయన ఎంతసేపు మీ దగ్గర ఉంటాడు. ఈ లోపల మీరు అడిగేవి ఉంటే అడిగేస్తారు. పోనీ ఆయన ఇచ్చేస్తాడు. ఎంతసేపు అనుభవిస్తారు అది.

**ఈ బంధాలలో ఎప్పుడు పడ్డాను, ఎలా పడ్డాను అనే గొడవలు వద్దు. జీవలక్షణాలు పోగొట్టుకోవటానికి భగవంతుడిని ఉపయోగించుకో, తరువాత ఆ భగవంతుడిని కూడా దాటిపోవాలి. చైతన్యం దగ్గరకు వచ్చేటప్పటికి జీవలాక్షణాలు, భగవంతుని గొడవ కూడా ఉండదు. చైతన్యానికి భిన్నంగా ఏదీ ఉండదు. దాని దగ్గర రెండో వస్తువు లేదు.**



**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# సత్య ప్రాప్తి

ఈ మానవజన్మకు పరమార్థం అమరత్వాన్ని పొందడమే! నిర్వాణ స్థితిని పొందడమే, జీవితపు పరమావధి మరియు ఏకైక లక్ష్యం. సత్యప్రాప్తిని పొందని జన్మ జన్మే కాదు. అందువల్లే “సత్య జ్ఞానము లేని ఈ జన్మ ఫలమేమి యొప్పగ రావేల అరుణాచలా” అన్నారు భగవాన్ తమ అక్షరమణమాలలో. మన జీవిత కాలము బహు స్వల్పం. అట్లే మనకి ఉన్న శక్తి పరిమితం. మనకున్న పరిమిత కాలము మరియు పరిమిత శక్తులతో వాస్తవంగా తాను ఎవరో అన్వేషించుకోవాలి. అశాశ్వతమైన ఈ జీవితంలోనే ‘శాశ్వతత్త్వాన్ని’ అనుభవైకవేద్యం చేసుకోవాలి. ఇది ఓ మహా యజ్ఞానికి, ఓ మహా యుద్ధానికి ఆహ్వానం. కాబట్టి అనవసర విషయాల జోలికి పోయి శక్తిని, కాలాన్ని వృథా చేసుకోకూడదు. మనస్సు యొక్క పుట్టుక స్థానాన్ని శోధించి మనోనాశాన్ని సాధించాలి. ప్రారబ్ధాన్ని ప్రీతిగా అనుభవిస్తూ జీవితంలో ప్రతీ చేష్ట, తలంపు, మాట, నిరాడంబరంగా అహంకార రహితంగా ఉండాలి. అదే తపస్సు. బంగారముతో తయారైన ఆభరణాలు బంగారమే అయినట్లు, పరమాత్మే సకల చరాచర జగత్తుకు ఆధారము. దుఃఖ స్పర్శ లేని సుఖం, ఆనందం లభించాలంటే స్వరూపంగా ఉన్న సత్యాన్ని తానుగా, నేనుగా, అనుభవైకవేద్యం చేసుకోవాలి. నాలో ఏదో విశేషం ఉంది అనుకుంటే అది అహంకార లక్షణం. మనిషికి గర్వం పనికిరాదు. ఆసక్తి దోషం పెట్టుకోకూడదు. మనకు ఏ కారణం వల్ల ఈ జన్మ వచ్చిందో, తద్వారా దుఃఖాన్ని అనుభవిస్తున్నామో, ఆ కారణాన్ని అనగా దేహాత్మబుద్ధిని తొలగించుకుంటే, ఇక ఆపై సంసారం పునరావృత్తి అవదు. “మనము నిజముగా పవిత్రులమైతే లోకంలో అపవిత్రత కనబడదు, మనలో ఉన్నదే బయట కనిపిస్తుంది. ఇతరులలో కనబడే దోషాలు మనలోని దోషాలే” అన్నారు సద్గురు శ్రీనాన్నగారు. జగత్తు బ్రహ్మమే అయినా తత్త్వ జ్ఞానం లేకపోతే అది వాసనామయం అవుతుంది. చిత్తశుద్ధి, జ్ఞానశుద్ధి, కర్మశుద్ధి ఆవశ్యకములు. సత్యాన్వేషకునికి మాత్రమే అజ్ఞానం కాలి బూడిద అవుతుంది. సత్యాన్ని ఆధారంగా చేసుకుని జీవించే వాడికి మాత్రమే జ్ఞానోదయం అవుతుంది. అంతర్యామిని దర్శించాలంటే జ్ఞాన నేత్రం కావాలి. మనము చేసే ఏ సాధన అయినా స్వరూపానుభూతికి సహకరించాలి. ‘నేను బ్రహ్మమే’ అన్న సత్యంలోకి మేల్కోవాలి. సత్యాన్వేషణకు సత్యాన్వేషణే అత్యంత ప్రాముఖ్యమైనది.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# "నేను ఎవఁడను?"

ఈ సృష్టిలో ప్రతీ జీవి దుఃఖ స్పర్శలేని సుఖాన్ని కోరుకుంటుంది. అది మన ఆత్మలో నుంచే రావాలి. బాహ్యవస్తు సముదాయాల్లోంచే లభించే సుఖం క్షణికం. కాని అందు సుఖం లేదు. ఉందని భ్రమిస్తాము. నా శరీరం, నాసంపద, నా ప్రతిష్ట, నా సంబంధ బాంధవ్యాలు, నా కట్టుబాట్లు నా నమ్మకాలు, నా ఆలోచనలు, ఇవి అన్నీ కలిపి 'నేను' అన్నదిగా, జీవితంగా తయారు అయిపోయింది. మృత్యువు ఈ నేను తీసుకొని పోతుంది. అదే ఉన్న ఏకైక భయం, ఇవి అన్నీ నిజమైన 'నేను' కాదని వీటికి భిన్న మైన ఆత్మ నేను అని గురువాక్యాన్ని విశ్వసించితే భయం మాయమైపోతుంది. నిజానికి మన హృదయంలో ఒంటరియే దానిలో మనకు అనుభవం లేక భయం ఏర్పడింది. నేను అన్నది మనస్సు చేసే ఉత్పత్తి. నాకు మోకాళ్లనెప్పలు, రొంప, జ్వరం అన్న మాటలు శరీరానికి సంబంధించినది ఆత్మ ఎట్టి సంబంధంలేదు 'కాలం'కూడా మనో కల్పితమే. నేను అన్నదానివల్లనే చైతన్యం తెలయబడటం లేదు. ఉన్నది చైతన్యమే కాని ఏదో పోగొట్టుకొన్నామని అనిపిస్తుంది. ఆలోచనలు అన్నీ ఉత్పత్తి స్థానంలోనే ఆపుచెయ్యాలి. వైరాగ్యం అలవరుచుకోవాలి. అప్పుడే చైతన్యాన్ని ఎరుక పరుచుకోగలము. సంపద, సౌందర్యం నీడలా మారుతూ ఉంటాయి. మారే పదార్థాలమీద దృష్టి ఉంచక, మారని దానిపై నిరంతరం దృష్టి నిలపాలి. 'నేను' అన్న భావన ఉన్నంతకాలం భూమికొలతలు, సంపద కొలతలు ఉంటాయి. ఈ ప్రకృతి సంపద ఈశ్వరునిది. మన జాగ్రత్తలో మనం ఉండాలి. నాకు ఉన్న ఊహాప్రతిమలతో, నాకు కలిగిన కాలంయొక్క గాయాలతో , నాకు ఉన్న గర్వంతో, పేరాశతో భయాలతో'నేను' రూపొందింది. 'నేను' అనేది కొలవటానికి కేంద్రబిందువు. అదే ఘర్షణలకు, కేంద్రస్థానం. దాన్ని 'నేను ఎవఁడను?' అనేవివేకంతో కూడిన ప్రశ్నతో అంతం చెయ్యాలి. భగవాన్ "ఇతరులు ఎంత దుర్మార్గులైనా వారి విషయంలో ద్వేషం పెట్టుకోరాదు. అంతా ఈశ్వర ప్రణాళిక ప్రకారం జరుగుతున్నది. దాన్ని తానుగా జరగనియ్యాలి" అన్నారు. శ్రీ నాన్నగారు "ఈశ్వరునికి తెలియకుండా ఏమీ జరుగదు. దాన్ని గురించి చెమటలు పట్టించుకొని నిద్రపోకుండా చేసుకోకండి శుభ్రంగా నిద్రపొండి" అన్నారు. సూర్యకాంతి వల్ల పద్మం వికశిస్తుంది. అలాగే మన కర్మలు కర్త అయిన ఈశ్వరుడు ఫలింపచేస్తున్నాడు. దాన్ని మనం తప్పించుకోలేము. ఈ రహస్యము మన గుండెలకు పడితే జరిగే పరిణామాలను చూస్తూకూర్చోవటమే మన వంతు. అంటే మన పరిధిలో మనం చెయ్యవలసినది చేసి ఈశ్వరునిపై భారం వెయ్యటమే మనవంతు. అదే వివేకం. పని చెయ్యాలి. ప్రతీకారం చెయ్యకుండా ఉంటే కర్మల భారం తిరిగి అంటుకోదు. గురువుకు శ్రమ కలిగించకూడదు. ఫలితాలపట్ల నిరాశ, నిర్లిప్తిత సాధకునకు శ్రీరామరక్ష తెలివి వల్ల, యుక్తి వల్ల ప్రారబ్ధాన్ని తప్పించుకోలేము. విధి చేతుల్లో మనం కీలుబొమ్మలము, బలిపశువులము అందుకే భగవాన్‌బోధ "ఊరక ఉండు, నేను దైవమని ఎరుంగుము" అన్నారు. జాగ్రత్, స్వప్న అవస్థలు లేవని ఈ కనిపించేది అంతా దృశ్యమానమని ఉన్న సత్యం ఒక్కటే అని ఆత్మనీడలో సుఖంగా జీవించు" అన్న గురువాక్యాన్ని అనునిత్యం స్మరిస్తే పవిత్రులమై మనమెవరమో మనం తెలుసుకొని సుఖిస్తాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966**